RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 241 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 సెప్టెంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## లాలూ ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ : తక్కువ ధరకు భూములు తీసుకొని వాటి యజమానుల కు ఉద్యోగాలు ఇచ్చారన్న కేసులో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్‌ను సీబీఐ ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనుమతి ఇచ్చారు. 2004-09 మధ్య లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు బహుమతులుగా భూములను పొందడం, వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా లబ్ధి పొందారని, ప్రత్యుపకారంగా వాటి యజమానులకు రైల్వే ఉద్యోగాలు ఇచ్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. బిహార్‌లో భూములు తీసుకొని మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ కేంద్రంగా ఉన్న వెస్ట్ సెంట్రల్ జోన్‌లో గ్రూపు-డి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించింది.

ఈ కేసులో లాలు, ఆయన కుటుంబ సభ్యులతో పాటు మరో 30మందికిపైగా నిందితులు ఉన్నారు. రాష్ట్రపతి అనుమతి ఇచ్చిన పత్రాన్ని సీబీఐ ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది.

# దసరాకే రైతు భరోసా.....

## నూతన మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు!!




హైదరాబాద్ : రైతులకు పెట్టుబడి ఆర్థిక సాయంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నిధులు దసరా కానుకగా అందించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అక్టోబర్ 12న దసరా పండగ ఉన్న నేపథ్యంలో.. అదే రోజున నిధులను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

వాస్తవానికి ఈ రైతు భరోసా పెట్టుబడి సాయం డబ్బులు అన్నదాతలకు జులైలోనే అందాల్సి ఉంది. అయితే ప్రభుత్వం 2లక్షల రైతు రుణమాఫీ అమలుకు ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో నిధుల కొరతతో రైతు భరోసాను వాయిదా వేసింది. అదిగాక గత ప్రభుత్వ హాయంలో రైతుబంధు నిధులు అనర్హుల పాలయ్యాయని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను రూపొందించాలని నిర్ణయించుకుంది. దీనిపై ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ జిల్లాల్లో పర్యటించి అభిప్రాయ సేకరణ సైతం పూర్తి చేసింది. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు ఈ కమిటీ మెంబర్లుగా ఉన్నారు. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలతో కూడిన నివేదికపై అసెంబ్లీలో చర్చించి నూతన విధివిధానాలు రూపొందిస్తామని భట్టి ప్రకటించారు. ఎన్ని ఎకరాల పరిమితితో రైతు భరోసా సాయం అందించాలి..కౌలు, పోడు రైతులకు ఎలా అందించాలన్నదానిపై ప్రభుత్వం ఇంకా కసరత్తులోనే ఉంది.

ఈ నేపథ్యంలో ఈ దఫా రైతు భరోసాను నూతన మార్గదర్శకాలతో అందిస్తారా..మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లుగా రూ.15 వేలుగా అందిస్తారా అన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత కొరవడింది. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా అమలుపై నేడు కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.



## రికార్డు స్థాయిలో నమోదైన విద్యుత్ వినియోగం

హైదరాబాద్ : దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ (టీఎస్ఎస్పీడీసీఎల్) సంస్థ పరిధిలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ సీజన్‌లో భారీగా వర్షాలు కురవడం, నీటి లభ్యత పెరగడం కారణంగా భారీగా విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 20వ తేదీన ఉదయం 10 గంటలకు 9,862 మెగా వాట్లు అత్యధిక విద్యుత్ వాడకం జరగగా.. ఈ నెల 20న ఉదయం 10 గంటల 35 నిమిషాలకు 9,910 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగించినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి డిమాండ్ భారీగా పెరగడంతో ఈ వారంలో సరాసరి విద్యుత్ డిమాండ్ 9,317 మెగావాట్లు నమోదైంది. గతేడాది సరాసరి విద్యుత్ డిమాండ్ 9,138 మెగా వాట్లుగా నమోదైంది. ప్రస్తుతం సరాసరి విద్యుత్ వినియోగం 190.29 మిలియన్ యూనిట్లు కాగా, గతేడాది 182.11 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వ్యవసాయ రంగంలో డిమాండ్ భారీగా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో అత్యధికంగా విద్యుత్ డిమాండ్ 10,000 మెగావాట్లను కూడా దాటే అవకాశం ఉందని, డిమాండ్ ఎంతగా పెరిగినా దానికి తగ్గట్టు విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి తెలిపారు.

## కవితక్క రీ ఎంట్రీ అప్పుడేనా..?

హైదరాబాద్ : కేసీఆర్ రాజకీయ వారసత్వంతో కవిత రాజకీయాల్లో వచ్చారు. రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ ఎంపీగా గెలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. గెలిచిన తరువాత కూడా కేవలం ఒకే పార్లమెంట్ నియోజకవర్గానికి కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగానూ గుర్తింపు సాధించారు. చాలా సందర్భాల్లోనూ రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేశారు. అందుకే.. ఆమెకు రాష్ట్రవ్యాప్తంగానూ అభిమానులు ఉన్నారు. కట్ చేస్తే.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత అరెస్ట్ అయ్యారు. సుమారు 5 నెలలకు పైగా ఆమె జైలులోనే ఉండిపోయారు. దాంతో కవిత ఎప్పుడు జైలు నుంచి విడుదల అవుతారా అని అభిమానులంతా ఎదురుచూశారు. ఇటీవల ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. ఆమె వచ్చి కూడా 20 రోజుల పైనే అవుతోంది. కానీ.. ఇప్పటివరకు ఆమె ప్రజాక్షేత్రంలోకి రాలేదు. కుటుంబసభ్యులతో గడుపుతున్నారు. వచ్చీరాగానే కేసీఆర్‌ను కలుసుకున్న ఆమె.. కొన్ని రోజులపాటు అక్కడే ఉండిపోయారు. అయితే ఇప్పుడు ఆమె అభిమానులంతా కవిత ఎప్పుడు ప్రజల్లోకి వస్తుందా అని చూస్తున్నారు. అయితే.. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పండుగ బతుకమ్మ. ఈ ఉత్సవాలు రాష్ట్రంలో మరో పది రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయి. ఏటా కవిత తెలంగాణ జాగృతి పేరిట బతుకమ్మ ఉత్సవాలను జరుపుతుంటారు. కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా.. ఇతర దేశాల్లోనూ ఈ పండుగ వైభవాన్ని చాటుతుంటారు. ఈరోజు బతుకమ్మ ఖ్యాతి ఖండాంతరాలకు చేరిందంటే అది కవిత క్రెడిట్ అనే అందరూ చెబుతూ ఉంటారు. ఈ పండుగ వచ్చిందంటే ఎమ్మెల్సీ కవిత చేసే హడావుడి అంతా ఇంతా కాదు. వారం రోజులపాటు నిత్యం ఒక్క చోట బతుకమ్మలను స్వయంగా పేరుస్తూ వేడుకలు నిర్వహిస్తారు. నేటి తరానికి మన సంస్కృతిని చాటుతూ పండుగలా జరుపుతారు. అయితే.. పది రోజుల్లో ప్రారంభంక కానున్న బతుకమ్మ ఉత్సవాల్లో ఈసారి కవిత పాల్గొంటారా..? అనే సందిగ్ధం నెలకొంది. జైలు నుంచి వచ్చి ఆమె ఇంతవరకు బయటకు రాలేదు. ఒకవేళ బతుకమ్మ పండుగ వేళ వస్తే కాంగ్రెస్, బీజేపీల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందా..? అనే కోణంలోనూ ఆమె ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏటా ఘనంగా నిర్వహించి.. ఈ ఏడాది పండుగలో పాల్గొనకుంటే ప్రజల్లో నెగెటివ్ థింక్ వస్తుందనే కోణంలోనూ ఆలోచన చేస్తున్నట్లుగా సమాచారం. అయితే ఆమె అనుచరులు మాత్రం కవిత బతుకమ్మ ఉత్సవాలకు హాజరవుతుందంటూ చెప్పుకొస్తున్నారు.






# ఆషామాషీ కాదబ్బా...!

## ఆక్రమణదారుల్లో మొదలైన వణుకు!?

# ఇక తగ్గేదేలే!

## హైడ్రాకు తిరుగులేని అధికారాలు.. అదెంత పవర్ ఫుల్ అంటే?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానసపుత్రిక హైడ్రాకు సర్వాధికారాలు కట్టబెట్టేశారు. తాజాగా జరిగిన మత్రివర్గ సమావేశంలో హైడ్రా కోరలు మరింత పదునెక్కేలా చర్యలు తీసుకోవటమే కాదు.. దీనికి సంబంధించిన మరిన్ని అధికారాల్ని దఖలు పర్చటమే కాదు.. చట్టబద్ధతను కల్పించేలా చర్యలు తీసుకోవటం తాజా పరిణామం. అవుటర్ రింగు రోడ్డు లోపల ఉన్న చెరువులు.. కుంటలు.. నాలాలతో పాటు వాటి ఎఫ్ టీఎల్.. బఫర్ జోన్ల పరిరక్షణ.. అధికారాలన్నీ హైడ్రాకే అప్పజెప్పారు. అంతేకాదు.. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి డిప్యుటేషన్ మీద 169 మంది అధికారులు.. 940 మంది పొరుగుసేవల సిబ్బందిని హైడ్రాలో నియమించేందుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర కాబినెట్ నిర్ణం తీసుకుంది. ఇతర శాఖల మాదిరి హైడ్రాకు ఉన్న అధికారాల్లో పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గతంలో మున్సిపాలిటీలు.. వివిధ శాఖలకు సంబంధించిన అన్ని అంశాలను హైడ్రాకు అప్పగిస్తూ.. ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 అర్బన్ స్థానిక సంస్థలతో పాటు.. ఇటీవల గ్రేటర్ లో చేర్చిన 51 పంచాయితీలను దీని పరిధిలోకి తీసుకువస్తున్నారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన రాష్ట్ర కేబినెట్ భేటీలో వివిధ అంశాల్ని చర్చించారు. హైడ్రాకు అధిక ప్రాధాన్యతను కల్పించారు. వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన కీలక అధికారాల్ని హైడ్రాకు దఖలు పర్చిన వైనం ఆసక్తికరంగా మారింది. దీంతో హైడ్రా సూపర్ పవర్ గా మారిందని చెప్పాలి. దీని కోరలు పదునెక్కటమే కాదు.. చెరువుల బఫర్ ల్యాండ్ ను.. ఎఫ్ టీఎల్ లలో చేపట్టే నిర్మాణల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించేందుకు అవకాశం ఇవ్వనున్నారు.

# సంపాదకీయం

## తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్.. దీని తెరవెనుక ఉన్నదెవరో?

తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్న సమయంలో ప్రధాన చర్చంతా హైదరాబాద్ మీదనే నడిచేది. తమిళనాడు నుంచి విడిపోయిన సందర్భంలో మద్రాస్ ను.. ఆపై ఉమ్మడి ఏపీ కోసం కర్నూలు రాజధానిని వదులుకున్నామని.. మన రాజధాని అని భావించి హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టామని ఇక్కడ సెటిలయిన, వ్యాపారాలు చేస్తున్న వారి తరఫున సీమాంధ్ర నాయకులు వాదించేవారు. ఇందులో ప్రజల కంటే సీమాంధ్ర నాయకుల ఆందోళనే ఎక్కువగా కనిపించేంది. మరోవైపు తెలంగాణ ప్రకటన జరిగాక కూడా అనేక అనుమానాలు, ఆందోళనలు. ఇక తెలంగాణ ప్రజల వాదన వేరేలా ఉండేది. ఉమ్మడి ఏపీ ఆవిర్భావం కంటే ముందే హైదరాబాద్ డెవలప్ అయిందని.. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ నగరం ప్రత్యేకంగా ఎవరి ప్రమేయమూ లేకున్నా మరింత డెవలప్ అవుతుందని వ్యాఖ్యానించేవారు.

**హైదరాబాద్ పైనే పీటముడి :** ఉమ్మడి ఏపీ విభజన సందర్భంలో మిగతా తెలంగాణ వ్యాప్తంగా ఇబ్బంది లేకున్నా.. హైదరాబాద్ పైనే పీటముడి పడింది. అప్పటి రాజకీయ నాయకులు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టినవారి ప్రయోజనాలను స్టేక్ హోల్డర్స్ అంటూ తెరపైకి తెచ్చారు. అయితే, హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా 2014 నాటికి తెలంగాణ సాకారమైంది. ఈ గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగిసింది. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్ లో సెటిలయిన సీమాంధ్రుల విషయమై తీవ్ర చర్చ జరిగింది. ఈ పదేళ్లలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ రాలేదు. కాగా, తెలంగాణ ఉద్యమ సమయంలోనే సీమాంధ్రుల పరిరక్షణ కంటూ కొన్ని సంఘాలు వెలిశాయి. తమ గొంతులు వినిపించాయి. చివరకు అంతా ప్రశాంతంగా ముగిసింది.

**మరోసారి తెరపైకి...** పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు తీరి.. దాదాపు పదేళ్లు బీ(టీ)ఆర్ఎస్ అధికారం ముగిసిన తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేతికి పగ్గాలు వచ్చాయి. బీఆర్ఎస్ తెలంగాణలో తొలిసారిగా ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఇక ఇటీవలి పరిణామాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గాంధీ ఆంధ్రా వ్యక్తి అని అక్కడికే పంపిస్తామంటూ కౌశిక్ మాట్లాడారు. దీంతో బీఆర్ఎస్ మరోసారి తమ సెంటిమెంట్ ఆయుధమైన తెలంగాణ వాదాన్ని ఎంచుకుంటోందా? అనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో ఓ కీలక ప్రకటన కనిపించింది.

**తెరవెనుక ఉన్నది ఎవరో? ...** తెలంగాణ ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ అంటూ ఇటీవల ప్రధాన మీడియాలో ఓ ప్రకటన కనిపిస్తోంది. దీనికి అడుసుమిల్లి కల్యాణ్ ప్రెసిడెంట్ గా ప్రకటనలో ఉంది. తెలంగాణలో ఏపీ సెటిలర్ల గొంతుక అనేది వీరి ఉద్దేశం. తెలంగాణలో ఉన్న ఏపీ సెటిలర్స్ కుటుంబసభ్యులందరికీ ఫ్రంట్ ఆవిర్భావ శుభాకాంక్షలను తెలుపుతున్నారు. వాస్తవానికి తెలంగాణ, ఏపీ వాదనలు సమసి అంతా ప్రశాంతంగా ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయి. ఇలాంటి సమయంలో కౌశిక్ రెడ్డి రాయి వేశారు. దీంతోనే తెలంగాణలో ఏపీ సెటిలర్స్ ఫ్రంట్ ఉనికిలోకి వచ్చిందా? అనే అభిప్రాయం వినిపిస్తోంది. బీఆర్ఎస్ భవిష్యత్ లో మళ్లీ తెలంగాణ వాదం వినిపిస్తే దానికి కౌంటర్ గా ఈ ఫ్రంట్ ను ముందుకు తెచ్చే ఉద్దేశం ఉందా? అనే ఊహాగానాలు వస్తున్నాయి. మరి దీని తెరవెనుక ఉన్నదెవరో?

# స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పై అవగాన ర్యాలి

### మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది






శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతహి సేవా కార్యక్రమం పై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సూచించారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 భాగంగా స్కూల్ విద్యార్థులు, స్వయం సహాయక బృందాల సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి అవగాహన నిర్వహించి ఏక్ పేడ్ మాకే నామ్ పే కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్వచ్ఛతా హీ సేవా పై ర్యాలి నిర్వహించి అవగాహన పరుస్తూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రేణుక రాజవెల్లి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కన్నేశ్వర్ రావు, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# గనుల్లో.. ఘనులు!



తాండూరు : జిల్లాలోని సర్కారు భూముల్లో గని నిక్షేపాలపై అక్రమార్కుల కన్ను పడింది. ఎలాంటి అనుమతులు పొందకుండానే యథేచ్ఛగా యంత్రాల గునపాలు భూమాత గుండెలను గాయం చేస్తున్నాయి. రూ.కోట్ల విలువజేసే సహజ సంపద తరలించేందుకు పావులు కదుపుతున్న వైనంపై కథనం.

దేశ విదేశాల్లో ఎనలేని గిరాకీ తాండూరు నాపరాయి నిక్షేపాలకు దేశ విదేశాల్లో గిరాకీ ఉంది. ఇక్కడి 300లకుపైగా గనుల్లో తవ్వకాలతో వెలికి తీసిన నిక్షేపాలను ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు నిత్యం తరలిస్తారు. అంతటి ప్రాధాన్యమున్న నాపరాయిని కొందరు అప్పనంగా తవ్వుకుపోయేందుకు సన్నాహాలు ప్రారంభించారు. తాండూరు మండలం సంగెంకలాన్ శివారు సర్వే సంఖ్య 109లో 127 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉంది. దీంట్లో దాదాపు 70 ఎకరాల భూమి పచ్చని చెట్లతో అనంతగిరి గుట్టను తలపించేలా అలరారుతోంది. వీటిపై అక్రమార్కుల కన్ను పడింది.

పట్టణానికి చెందిన కొందరు అక్రమార్కులు ఇటీవల జేసీబీలతో రూ.30కోట్లకుపైగా విలువజేసే నాపరాయి తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. తొలుత పైనున్న బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్‌స్టిక్స్ అమర్చి యథేచ్ఛగా పేలుళ్లు జరిపారు. బండరాళ్లను తరలించి భూగర్భంలో నిక్షిప్తమైన విలువైన నాపరాళ్లను తవ్వకాలతో వెలికి తీసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఏడు శాఖల అనుమతులు పొందకుండానే..: గనుల తవ్వకాలను ఏడు శాఖల నుంచిఅనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా పనిచేస్తున్నారు. నిత్యం ఎగుమతులు : లక్ష చదరపు అడుగుల నిక్షేపాలురోజుకు లావాదేవీలు: రూ.50లక్షలు

అనుమతులు లేకుండా కొనసాగుతున్న గనులు: 60కిపైగా

బాధ్యులపై కఠిన చర్యలు..- శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ, తాండూరు.

ప్రభుత్వ భూముల్లో నాపరాయి తవ్వకాలకు పాల్పడితే ఉపేక్షించబోం. క్షేత్రస్థాయిలో పరిశీలించి పేలుళ్లు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటాం. సర్కారు భూముల్లో గని కార్యకలాపాలు నిర్వహించకుం డా నిఘా పెడతాం. తవ్వకాలు నిలిపివేస్తాం..బల్నే సత్యనారాయణ, ఏడీ, గనులు భూగర్భ వనరుల శాఖ, తాండూరు. అనుమతులు పొందకుండా గనులు నిర్వహించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. చిన్నతరహా ఖనిజాల తవ్వకాలు, ఎగుమతుల పర్యవేక్షణకు మండల పరిషత్ అధికారి, ప్రత్యేకాధికారులకు బాధ్యత కూడా ఉంటుంది.

# స్టాంపు పేపర్ల విక్రయాల్లో అదనపు వసూళ్లు



హుజూరాబాద్ : నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల విక్రయాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి విలువ కంటే అదనంగా వసూలు చేస్తూ వెండర్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలుదారులు అడిగిన మొత్తాన్ని ముట్టజెప్పక తప్పడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంతో సహా 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు న్నాయి. వీటి పరిధిలో 161 మంది అనుమతి పొందిన వెండర్లు ఉండగా జ్యుడీషియల్ స్టాంపులతోపాటు ఫ్రాంకింగ్ యంత్రాల ద్వారా ప్రతి రోజూ సుమారు 20 వేల వరకు వివిధ రకాల స్టాంపు పేపర్లు విక్రయిస్తుండగా రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.15 లక్షల ఆదాయం సమకూ రుతోంది. రూ.10 విలువ చేసే స్టాంప్ పేపర్ గతంలోనే ప్రభుత్వం రద్దు చేయగా రెండేళ్ల నుంచి రూ.20 పేపర్లు కూడా రావడం లేదు. ప్రస్తుతం వెండర్ల వద్ద రూ.50, రూ.100 విలువ చేసే స్టాంప్ పేపర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్టాంప్ పేపర్ల విక్రయాలపై ప్రభుత్వం 5 శాతం కమీషన్ చెల్లిస్తోంది. కానీ వెండర్లు మాత్రం రూ.50 విలువ చేసే దానికి రూ.80, రూ.100 విలువ చేసే స్టాంప్ పేపర్‌కు రూ.140కి పైగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి కొందరు రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150, రూ.50 స్టాంప్ పేపర్‌ను రూ.100 వరకూ విక్రయిస్తున్నారు. తాము అడిగిన మొత్తం ఇవ్వకపోతే స్టాక్ లేవంటూ బుకాయిస్తున్నారు.

ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నా..

స్టాంపుల కొరత, నకిలీ స్టాంపుల విక్రయం, ట్యాంపరింగ్ వంటి సమస్యలకు కళ్లెం పడేలా ఇలాంటి అక్రమాలకు చెక్ పడేలా ప్రభుత్వం గతేడాది ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. గతంలో స్టాంపుల ను నేరుగా విక్రయించడం, పాత తేదీలు వేసి విక్రయించడం వంటి మోసాలు జరిగేవి. కొనుగోలుదారుల అవసరాన్ని బట్టి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. పైగా ప్రతి రోజూ వెండర్లు ఎన్ని స్టాంపులు విక్రయించారనే కచ్చితమైన లెక్కలు కూడా రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉండేవి కావు. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా స్టాంపు పేపర్లు విక్రయించే విధానాన్ని అమలు చేసింది. తద్వారా కొనుగోలుదారుల వివరాలు, వెండర్లు ఏ రోజు ఎన్ని స్టాంపు పేపర్లు విక్రయించారనే పూర్తి వివరాలన్నీ అంతర్జాలంలో నిక్షిప్తమవుతాయి. ఈ విధానం వల్ల అక్రమాలకు తావుండదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతుండగా.. అదనపు వసూళ్లకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతుండటం గమనార్హం. మరోవైపు ఆన్‌లైన్ విధానంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెండర్లు అంటున్నారు. కంప్యూటర్, ప్రింటర్, అంతర్జాలం సౌకర్యం వల్ల అదనంగా ఖర్చు అవుతుందని, స్టాంప్ పేపర్ల విక్రయాలపై ప్రభుత్వం ఇచ్చే అయిదు శాతం కమీషన్ ఏ మాత్రం సరిపోవడం లేదని చెబుతున్నారు.

కృత్రిమ కొరతతో రెట్టింపు ధర

నిబంధనల ప్రకారం వాస్తవ ధరకే అమ్మాలి. ఒక్క పైసా అదనంగా తీసుకోవద్దు. కానీ ఇదెక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ఒక్కోసారి స్టాంప్ పేపర్లకు కృత్రిమ కొరత సృష్టించి వాటి విలువపై రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఇదంతా సబ్ రిజిస్ట్రార్ అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీటి విక్రయాల కోసం ఒక కౌంటర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. చాలా చోట్ల సిబ్బంది కొరత సాకుతో స్టాంప్ పేపర్లను వెండర్లకే అందజేస్తున్నట్లు తెలుస్తోంది. వెండర్లు తమ పరపతితో స్టాంప్ పేపర్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి వాటి వాస్తవ విలువ కంటే ఎక్కువగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫ్రాంకింగ్ యంత్రాల ద్వారా స్టాంప్ పేపర్లు విక్రయించేందుకు ఉమ్మడి జిల్లాలో 14 మంది అనుమతి పొందారు. ఫ్రాంకింగ్ చలానా చెల్లించిన వినియోగదారుల నుంచి అదనంగా 10 శాతం వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

నాన్ జ్యుడీషియల్ స్టాంపులను వెండర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలి. నిబంధనలను అతిక్రమించి అదనంగా వసూలు చేసే వెండర్ల లైసెన్స్ రద్దు చేస్తాం. కరీంనగర్‌లో కొందరు ఇలాగే చేస్తే వారిని హెచ్చరించి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నాం. లైసెన్స్ జారీ సమయంలోనే స్టాంపుల విలువ ఆధారంగా విక్రయించాలని, ఒక్కపైసా ఎక్కువ తీసుకోవద్దని చెబుతాం. ఎవరైనా ఎక్కువ తీసుకుంటే నేరుగా మాకు ఫిర్యాదు చేస్తే విచారించి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

# బతుకమ్మలతో వచ్చే ఆడపడుచుల కొరకు విధి దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించండి...

### అలియాబాద్ గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్నటువంటి శామీర్పేట తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన... అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు కమటం కృష్ణారెడ్డి

శామీర్పేట (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామంలోజరిగే బతుకమ్మ పండుగ ఊరు ఆడపడుచులందరూ గ్రామ రామాలయం వద్దకు బతుకమ్మలు తీసుకు వెళ్లడానికి ఉన్న రహదారి వెంబడి విధి దీపాలు, వాగులో ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించి, బతుకమ్మ పండుగ రోజు రామాలయం వద్ద డిజె సౌండ్ ఏర్పాటు చేయించగలరంటూ అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ ప్రముఖ నాయకులు కమటం



కృష్ణారెడ్డి తదితరులు శామీర్పేట తహసిల్దార్, అలియాబాద్ స్పెషల్ ఆఫీసర్ కి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా దసరా పండుగ రోజు సబ్‌స్టేషన్ నుండి జంబి వరకు డే లైట్ పెట్టడానికి అలియాబాద్ గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్నటువంటి మండల్ తహసిల్దార్ కు శనివారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కనికల లింగం, బాల్ రెడ్డి, బాలేష్ తదితర అలియాబాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ పై అవగాహన ...

శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల శనివారం హెచ్. ఐ.వి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన పెంచి హెచ్ఐవి రహిత తెలంగాణను సాధిద్దాం అనే ప్రోగ్రాంలో భాగంగా శామీర్ పేట ఆరోగ్య కేంద్రం ఐ సి టి సి కౌన్సిలర్ ఎం శ్రీనివాస్, ఎస్ ఎస్ఎంఎస్ ఎన్ జి ఓ టీం, వై ఆర్ జి కేర్ ఎన్ జి ఓ టీం కళాశాలలో



అవగాహన సదస్సును నిర్వహించారు. హెచ్ఐవి,ఎయిడ్స్ ఎన్ని విధాలుగా సోకుతుంది దాని నివారణ మార్గాలు ఏమిటి అనే వాటి మీద సవివరంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, డాక్టర్ ప్రవంతి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగీ.. వణికిస్తోంది..!

ఖమ్మం : నిన్నమొన్నటి వరకు జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. అనేక గ్రామాల్లో పారిశుద్ధ్యం దెబ్బతింది. వీధులు బురదమయంగా మారాయి. కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికార యంత్రాంగం తక్షణం స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైనచోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతితో మాట్లాడుతూ ప్రతి డ్రైడే నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో సమీపంలోని 100 కుటుంబాల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

**తాండవిస్తున్న అపరిశుభ్రత**

వైరా మండలం కారేపల్లిలో మెయిన్‌రోడ్డు, బీసీ కాలనీ, దళిత కాలనీ, రజక బజారు, బొడ్డురాయి సెంటర్‌లో పారిశుద్ధ్యం దెబ్బతింది. బీసీ కాలనీలోనే 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. మురుగుకాల్వ వ్యవస్థను మెరుగుపరిచి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ముందస్తు సమాచారం లేకుండానే..!**

సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని చెరుకుపల్లి, తుమ్మలనగర్, జగన్నాథపురంలో పారిశుద్ధ్యం దెబ్బతింది. ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. జలుబు, దగ్గు, విరేచనాలతో మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడిప్పుడే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జగన్నాథపురంలో సింగరేణి అధికారులు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ ముందస్తు సమాచారం ఇవ్వటం లేదని పలువురు వాపోతున్నారు.

**ఊరికి జ్వరమొచ్చింది** మధిర మండలం మాటూరుపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో, ఎస్సీకాలనీ, చెరువుకట్ట ప్రారంభ ప్రదేశం, పాఠశాల ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్త సేకరణ ట్రాక్టర్లు మూలనపడ్డాయి. చెత్తాచెదారం పేరుకుపోవటం, మురుగుకాల్వలో పూడిక తీయకపోవటంతో అపరిశుభ్రత తాండవిస్తోందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో 60 మందికిపైగా జ్వరాలతో బాధపడు తున్నారు.

**మురికివాడల్లో తీవ్ర సమస్య**

ఖమ్మం నగరంలోని బల్లేపల్లి విద్యానగర్, ప్రశాంతినగర్, ప్రకాశ్‌నగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, కాల్వొడ్డు, మోతీనగర్, రాపర్తినగర్, ఏకలవ్యనగర్, విలీన పంచాయతీల్లోని వివిధ ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి వర్షం నీరు నిలవటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే వెంకటేశ్వరనగర్, శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రాల పరిధిలో పది 'డెంగీ' కేసులు నమోదయ్యాయి.

**పారిశుద్ధ్యం.. అధ్వానం**

తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో అధికారికంగా పది మందికి డెంగీ జ్వరం సోకింది. మరో 20 మంది 'డెంగీ' లక్షణాలతో బాధపడుతున్నారు. సుమారు 100 మందికి కాలానుగుణ వ్యాధులు ప్రబలాయి. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం వైద్యశిబిరం నిర్వహించగా మళ్లీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఇటీవల గ్రామాన్ని సందర్శించి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా పారిశుద్ధ్యం మెరుగుపడలేదని స్థానికులు వాపోతున్నారు.

# ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లుగా పార్కు విక్రయం

హైదరాబాద్ : పొరపాటునో.. లంచాలకు లొంగో ఎక్కడైనా పొరపాటు జరిగితే దానిని సరిచేయాల్సిన ప్రభుత్వ విభాగాలు.. ఒకదాని వెంట ఒకటి అదే బాటలో నడిచి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పడానికి దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట కేవీఆర్ వెంచర్‌లో పార్కులు ప్లాట్లుగా మారిన తీరే నిదర్శనం. వెంచర్ యజమాని విజయరామరాజు ఫిర్యాదుతో డొంక కదులుతోంది. తన పేరుతో నకిలీ ఆధార్ కార్డును సృష్టించి పార్కుల కోసం కేటాయించిన రూ.100కోట్ల విలువైన స్థలాలను రెండేళ్ల క్రితం ఇతరులకు విక్రయించేశారు. కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తనపేరుతో నకిలీ వ్యక్తిని తీసుకెళ్లి సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మల్లంపేట భూ కబ్జాదారుల పనే... విజయరామరాజు ఫిర్యాదు మేరకు నరేష్, శివ వివరాలను దుండిగల్ పోలీసులు



తెలుసుకున్నారు. మల్లంపేట, దుండిగల్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను కబ్జా చేస్తున్నారని గుర్తించారు. కేవీఆర్ వెంచర్‌లో లే-అవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన మూడు ఎకరాల భూములను కబ్జా చేశారని తెలుసుకున్నారు. వీటిని శ్రీకాంత్ సాహూ అనే వ్యక్తికి విక్రయించినట్టు రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా ధ్రువపర్చుకున్నారు. మల్లంపేటలో ఉంటున్న నరేష్‌కు నేరచరిత్ర ఉందని పోలీసులు తెలిపారు. మల్లంపేట కేవీఆర్ వెంచర్‌లో పార్కు స్థలాలను విక్రయించాక.. అందులో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అనుమతులతో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలకు సహకరించారు. నిర్మాణాలు పూర్తికాడంతో వాటికి సంబంధించిన ఆస్తి పన్నును చెల్లిస్తున్నారు.

# క్రీడా ప్రాంగణాలు.. బహుళ ప్రయోజనాలు

కూకట్‌పల్లి : నగర సుందరీకరణలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో పనులు పూర్తి చేసినా.. పలు రహదారులు, వంతెనలు, చెరువులు, ఖాళీ స్థలాల చెంత ఇప్పటికీ అధ్వాన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని నగర సుందరీకరణకు ఇటీవల ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కూకట్‌పల్లి జోన్ పరిధిలో రూపొందించిన ప్రణాళికలు.. కసరత్తు వివరాలివీ...

కళావిహీనం పోయి..సుందరంగా..

జోన్ పరిధిలోని కొన్ని ప్రధాన వంతెనల కింద ప్రాంతాలను సుందరీకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో ప్రధానమైనది హైటెక్‌సిటీ వంతెన. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెన కింద అపరిశుభ్రత దర్శనమిస్తోంది. కైత్లాపూర్ వంతెన కింద ట్యాంకర్ల అక్రమ పార్కింగ్, రాత్రిళ్లు గంజాయి బ్యాచ్‌ల హంగామా సాగుతోంది. బాలానగర్ ప్రధాన రహదారిలోని మరో వంతెనకింద గతంలో పార్కింగ్‌కు నిధులు కేటాయించినా, స్పందన రాకపోవడంతో ఉ



పసంహరించుకున్నారు. ఈ మూడు వంతెనల కింద ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతోపాటు..బహుళ ప్రయోజన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధంచేసి కార్యాచరణకు దిగారు. ఇందుకు రూ.2.75కోట్లు కేటాయించగా.. టెండర్లు పిలవడం, గుత్తేదారులకు ఇవ్వడం పూర్తయింది. హైటెక్‌సిటీ వంతెనకు రంగులు వేసే పనులు చేపట్టారు.మూడు వంతెనలకు రెండువైపలా రంగులు వేస్తారు. పచ్చదనం అభివృద్ధి చేయనున్నారు. వంతెనల కింద బహుళ ప్రయోజనకరమైన క్రీడా ప్రాంగణాలు అభివృద్ధి చేయనున్నారు. క్రికెట్, బాస్కెట్‌బాల్, షటిల్, స్కేటింగ్ ఆడుకోవడంతోపాటు అవసరమైనప్పుడు క్రీడా సమావేశాలు.. వివిధ రకాల ఈవెంట్లు కూడా నిర్వహించుకునేలా తీర్చిదిద్దుతున్నట్లు జడ్సీ అపూర్వ్‌చౌహాన్ చెప్పారు.

# మూడు దశల్లో మూసీకి విముక్తి

హైదరాబాద్ : మూసీలో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. మొదటి దశలో మూసీ గర్భంలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని రెండు రోజుల కిందట నిర్ణయించారు. ఈ ప్రక్రియను హైడ్రాకు అప్పగించనున్నారు. ముందుగా రెవెన్యూ, పోలీసు, బల్దియా, మూసీ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ఆక్రమణదారులతో మాట్లాడనున్నారు. వీరందరికీ ఇప్పటికే సిద్ధంగా ఉన్న రెండు పడక



గదుల ఇళ్లను ఇవ్వనున్నట్లు పురపాలక శాఖ సీనియర్ అధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు.

కూల్చివేతల బాధ్యత హైడ్రాకు.. అధికారిక లెక్కల ప్రకారం మూసీ గర్భంలోనే 2 వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఏళ్లుగా ఉంటున్న పేదలను ఖాళీ చేయిస్తే విమర్శలు వచ్చే అవకాశం ఉందన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు ఇక్కడి నివాసితులతో అధికారులు మాట్లాడనున్నారు. మూడు విడతలుగా అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించారు. మొదటి దశలో నది గర్భంలో నిర్మించిన భవనాలను తొలగిస్తారు. కూల్చివేతల బాధ్యతను హైడ్రాకు అప్పగించనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఆఖరి విడతలో భూసేకరణ: రెండో దశలో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న వాటిని, మూడో దశలో బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రైవేటు స్థలాలను భూ సేకరణ ద్వారా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

# మహిళా శక్తి.. సంపద సృష్టి



పెద్దపల్లి : నోరూరించే పిండి వంటలు...ఘుమఘుమలాడే మిఠాయిలు.. సంప్రదాయ రుచులతో క్యాంటీన్లు ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రజలకు నాణ్యమైన వంటకాలు, పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లతో మహిళలు ఉపాధి పొందేలా ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఆధునిక మార్కెట్‌కు తగినట్లుగా లాభాలు అర్జించే వ్యాపారాలను ప్రోత్సహించి, మహిళలచే సంపద సృష్టించడమే పథకం లక్ష్యం. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఐకేపీ) ఆధ్వర్యంలో ఔత్సాహిక మహిళలకు 14 రకాల యూనిట్లను కేటాయిస్తున్నారు.

ఆర్థికంగా బలోపేతమే లక్ష్యం

మహిళల జీవనోపాదులు మెరుగుపరిచి, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ పథకాన్ని వ్యక్తిగతంగా, సామూహికంగా అమలు చేస్తున్నారు.

యూనిట్లకు అనుగుణంగా రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణసాయం అందిస్తారు.

బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధిలో సైతం రుణాలను కేటాయిస్తున్నారు.

క్యాంటీన్లు, ఈవెంట్‌మేనేజ్‌మెంట్ల నిర్వహణపై పది రోజుల నైపుణ్య శిక్షణ. పాలు మరో 12 రకాల యూనిట్ల పంపిణీ.

నైపుణ్యంతో సాగితేనే...

ఏ రంగంలో అయినా వ్యాపార మెలకువలు నైపుణ్య వృద్ధి లేకపోతే నిర్వహణ కష్టంగా మారి నష్టాలు వచ్చే ప్రమాదం ఉంది. వ్యాపారం ప్రారంభించే ముందు ఆర్థిక పరమైన లాభనష్టాలను అంచనా వేసుకోవాలి. లక్ష్యాల కోసం ఏర్పాటు చేస్తే మార్కెట్ తీరు అందుకు భిన్నంగా ఉంటుంది. ఈమేరకు నైపుణ్యాలను పెంచేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు ఆయా లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ రంగంలో రాణించవచ్చు.

క్యాంటీన్లు ఎక్కడంటే

పెద్దపల్లి: సుల్తానాబాద్ ఎంపీడీవో కాంప్లెక్, ధర్మారం అతిథి గృహం సముదాయం, మంథని ఆర్డీవో అతిథిగృహం ఆవరణ, పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణం

కరీంనగర్: గంగాధర, కరీంనగర్ కలెక్టరేట్, స్వశక్తి మహిళా కళాశాల

జగిత్యాల: జగిత్యాల బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, చౌరస్తా, కొండగట్టు దేవాలయ ఆవరణ, ధర్మపురి దేవాలయ ఆవరణ, కోరుట్ల ఎంపీడీవో కార్యాలయ సముదాయం.

రాజన్నసిరిసిల్ల: సమీకృత పాలనా ప్రాంగణం, ప్రభుత్వ వైద్యకళాశాల.

ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు

పెద్దపల్లి పెద్దపల్లి, పెద్దబొంకూరు

కరీంనగర్ మానకొండూర్ మండలం అన్నారం

జగిత్యాల దరూర్

రాజన్నసిరిసిల్ల చందుర్తి మండలం జోగాపూర్

వ్యాపారాలపై అవగాహన

మహిళలకు జీవనోపాధి మరింతగా మెరుగుపరిచేందుకు స్థానిక అవసరాలను బటి ఎంచుకున్న రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఎంపిక చేసిన వారికి రుణాన్ని అందిస్తున్నాం. పేద, మధ్యతరగతి మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ఇది మంచి తరుణం.
రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పెద్దపల్లి

మెరుగైన ఉపాధి లభించనుందిమా గ్రామైక్య సంఘంలోని కొంత మంది సభ్యులం కలిసి క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు రుచికరమైన ఆహార పదార్థాలు, పిండివంటకాలు, భోజనాన్ని అందించనున్నాం. సమష్టి కృషితో ముందుకు సాగితే అందరికీ ఉపాధి లభిస్తుంది.అనిత, క్యాంటీన్ నిర్వాహకురాలు, సుల్తానాబాద్

# యూడైస్ ప్లస్ ప్రారంభం



సిరిసిల్ల : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఆయా పాఠశాలల యూడైస్ ప్లస్ పోర్టల్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు ప్రారంభమైంది. పాఠశాలల్లోని వసతులు, ఇతర వివరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నమోదు చేపడుతున్నారు. పాఠశాలకు సంబంధించిన లాగిన్‌లో యూడైస్ కోడ్ నమోదు చేసి వివరాలను పొందుపరుస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా బడులకు బడ్జెట్ కేటాయించడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరానికి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లుల కేటాయింపునకు అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను ఇది వరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గత సంవత్సరం వరకు యూడైస్‌గా కొనసాగగా, దానిని యూడైస్ ప్లస్‌గా నవీకరించారు. ప్రతి 3 గంటలకు ఒకసారి సాంకేతికత ఆధారంగా సమాచారం నవీకరించడం దీని ప్రత్యేకత. ఈ వెబ్‌సైట్‌లో పాఠశాల భౌతిక వనరులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. క్రీడా స్థలం, తరగతి గదులు, ఇంకా కావాల్సిన గదులెన్ని, అవసరమైన వసతులు వంటి వివరాలను ఎప్పటికప్పుడు అందులో పొందుపరుస్తున్నారు.

ప్రతి విద్యార్థికి 'పెన్'

యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన ప్రతి విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశ వ్యాప్తంగా ఏయే పాఠశాలల్లో ఏయే తరగతులు చదివాడు అనేది కచ్చితంగా తెలుస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్య పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, నోటుపుస్తకాలు పంపిణీ చేస్తుంది.

గత సంవత్సరం నుంచి 10వ తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసం యూడైస్ డేటానే పరిగణనలోకి తీసుకొంటున్నారు.

ఉపాధ్యాయులకు జాతీయ కోడ్

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్ (నంబర్)ను యూడైస్ కేటాయిస్తుంది. దీని ద్వారా ప్రతి పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతో పాటు ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. దీని ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని లెక్కించవచ్చు. యూడైస్‌లో నమోదు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు.

నెలాఖరులోగా పూర్తి చేస్తాం

యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల నమోదు ఈ నెల 2న ప్రారంభమైంది. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఏయే అంశాలు నమోదు చేయాలో వివరించాం. ఈ నెలాఖరులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేస్తాం.
శ్రీధర్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్

జిల్లాలో పాఠశాలలుప్రభుత్వ : 511 ప్రైవేటు : 129

మొత్తం విద్యార్థులు : 77,902

# పర్యావరణహిత అడుగులు

కరీంనగర్ : పర్యావరణ హితం కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహాలం దిస్తున్నాయి.. పెరుగుతున్న కాలుష్యం, భారంగా మారిన ఇంధన ధరలు తదితర కారణాలతో వాహనదారులూ వాటి వైపు మొగ్గు చూపుతున్నారు.. ఈ క్రమంలో ఈవీ కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల విక్రయాలు పెరగ్గా అదే స్థాయిలో ఛార్జింగ్ కేంద్రాలు లేకపోవడం మాత్రం సమస్యగా మారింది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 7,565 ఎలక్ట్రిక్ వాహనాలు ఆయా ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ అయి ఉన్నాయి. 2020లో 46 ఎలక్ట్రిక్ వాహనాలు ఉండగా, 2021లో వాటి సంఖ్య 532కు చేరుకోగా ప్రస్తుతం 7,565 ఉండటం గమనార్హం. వీటిలో ద్విచక్ర వాహనాలే ఎక్కువ. గ్రామాల్లోనూ ఈ-బైక్‌ల వినియోగం పెరిగింది. వీటిని కొనుగోలు చేసిన వారికి జీవితాల పన్నుతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం మినహాయింపునిస్తూ ప్రోత్సహిస్తోంది. గడువు ముగిసిన వాహనాలను తుక్కు కింద మార్చి ఆ సర్టిఫికెట్ చూపిస్తే దానిపై కూడా కొంత వరకు రాయితీ లభిస్తుంది.

సమస్యలున్నాయి..

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్నా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేవు. ప్రభుత్వ పరంగానూ ఏర్పాటు చేయలేదు.

ప్రస్తుతమున్న ఈవీ కార్లలో చాలా వాటి బ్యాటరీ సామర్థ్యం తక్కువ. వాహనదారుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి రావాలంటే మధ్యలో ఛార్జింగ్ చేయించాల్సిందే. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో తీసుకెళ్లలేని పరిస్థితి. దీంతో ఎక్కువ మంది దూర ప్రాంతాలకు ఇంధన వాహనాలను వినియోగిస్తూ సమీప ప్రాంతాలకు ఈవీలు ఉపయోగిస్తున్నారు. సాధారణ వాహనాలతో పోల్చుకుంటే ఖరీదు ఎక్కువగా ఉండటం, బ్యాటరీ జీవితకాలం పూర్తయితే కొత్తది



మార్చుకోవడానికి అధిక ధర వెచ్చించాల్సి రావడం చాలా మందిని వెనుకడుగు వేసేలా చేస్తోంది. ఈవీ కారు యజమానులు ఇంటి వద్దే తమ వాహనాలను ఛార్జింగ్ చేసుకుంటున్నారు. ఛార్జింగ్ కోసం ఆయా కంపెనీలు ప్రత్యేక పరికరం ఇస్తున్నాయి.సొంత ఇల్లు ఉన్నవారికి అయితే ఛార్జింగ్ పాయింట్ కోసం ఇంటి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసుకోవచ్చు. అద్దెకు ఉన్న వారికి మాత్రం ఇది ఇబ్బందిగా మారింది. ఇంటిలో పై అంతస్తులో ఉన్నవారిదీ ఇదే పరిస్థితి.అక్కడక్కడ ఉన్నా....ఈవీ వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో కొందరు హోటళ్లు, షోరూంల వద్ద ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాహనం ఛార్జింగ్ కావడానికి సమయం ఎక్కువగా తీసుకుంటుంది. దీంతో హోటళ్లు, షోరూంల వద్ద గంటల కొద్దీ ఉండటానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఇలా చేస్తే మేలు..ఛార్జింగ్ స్టేషన్లను విరివిగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

బ్యాటరీల సామర్థ్యం పెంచేలా, ఛార్జింగ్ సమయం తగ్గించేలా కంపెనీలకు సూచనలివ్వాలి.

# ఆరంభంలోనే అలసత్వం!

చౌటుప్పల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌ల వద్ద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) నివారణ చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల పరిధిలో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ రహదారిపై మొత్తం 17 ప్రాంతాల్లో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

వీటి టెండర్‌ను హరియాణాకు చెందిన సంస్థ రూ.282 కోట్లకు దక్కించుకొని చేపడుతుంది. జూన్ 23న చిట్యాలలో అండర్‌పాస్ వంతెనకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తర్వాత చౌటుప్పల్, చిట్యాలలో అండర్‌పాస్ నిర్మాణ పనులను గుత్తేదారు సంస్థ ప్రారంభించింది. కానీ.. మిగతా చోట్ల ఎక్కడా పనుల జాడే లేదు. ఏడాదిలోపే బ్లాక్‌స్పాట్‌ల వద్ద పనులు పూర్తిచేయాలని ఎన్‌హెచ్‌ఏఐ, గుత్తేదారు సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రెండు నెలలు గడిచినా పనుల ప్రారంభంలో వేగవంతం లేదు.

ఇక్కడ పనుల ఊసేలేదు..

కట్టంగూరు, నకిరేకల్, కేతేపల్లి, సూర్యాపేట, మునగాల, కోదాడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో అండర్‌పాస్, సర్వీసు రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో అండర్‌పాస్ వంతెనకు రూ.20-40 కోట్లు, ఒక్కో సర్వీసు రోడ్డుకు రూ.3 నుంచి 8 కోట్లు



నిధులను కేటాయించారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడా ఇంకా పనుల ప్రారంభమే కాలేదు.

వర్షాలు తగ్గాక వేగవంతం..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పనులకు ఆటంకం కలుగుతుంది. అందుకే పూర్తిస్థాయిలో గుత్తేదారు సంస్థ ఇంకా పనులను ప్రారంభించలేదు. వానలు తగ్గాక పనులు వేగవంతంగా నడుస్తాయి. చౌటుప్పల్‌లో చెరువు అలుగు పోస్తే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అందుకోసం తొలుత చౌటుప్పల్‌లో డ్రైనేజీ, సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలి. అనంతరం అండర్‌పాస్ పనులు ప్రారంభమవుతాయి.
నాగేశ్వర్‌రావు, పీడీ, ఎన్‌హెచ్-65

అసలు సమస్యలు ఇక్కడే..

చౌటుప్పల్‌లోని తహసీల్ కార్యాలయం దర్గా నుంచి భాస్కర్ థియేటర్ వరకు ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నారు. దీనికి కొద్ది దూరం నుంచి వలిగొండ రోడ్డు దాటి పద్మావతి ఫంక్షన్‌హాల్ వరకు అండర్‌పాస్ వంతెనను నిర్మించనున్నారు. ఈ రెండింటికి సుమారు రూ.100కోట్ల వరకు ఖర్చవుతుందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. చౌటుప్పల్‌లో జూన్ చివరి వారంలో పనులు ప్రారంభించినా.. వేగంగా అడుగులు పడటం లేదు. ప్రస్తుతం చెట్లు నరికే, వలిగొండ రోడ్డు సమీపంలో డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు చదును పనులు మాత్రమే నడుస్తున్నాయి. అండర్‌పాస్ పనులను ప్రారంభించాలంటే మొదట సర్వీసు రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలి. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను సర్వీసు రోడ్డు నుంచి రాకపోకలు సాగించేలా చూడాలి. ఇక్కడ సర్వీసు రోడ్డు పనులే పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. చిట్యాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

# గుట్టుగా గుట్కా దందా

భువనగిరి : పట్టణంలోని గంజ్ మార్కెట్‌లో మూడు దుకాణాల్లో గుట్టుగా సాగిస్తున్న గుట్కా దందాపై ఎస్వోటీ పోలీసులు ఈ నెల 10న దాడులు చేశారు. పెద్ద ఎత్తున నిల్వ చేసిన గుట్కా ప్యాకెట్ సంచులు పట్టుబడ్డాయి. ఓ వ్యాపారి వద్ద ఉన్న నాలుగు సంచులు సీజ్ చేశారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.5లక్షల వరకు ఉంటుందని అంచనా. మరో ఇద్దరు వ్యాపారుల దగ్గర దాదాపుగా రెండు వేల ప్యాకెట్లు పట్టుబడ్డాయి.

పొగాకు ఉత్పత్తులు, గుట్కా విక్రయాలపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ జిల్లాలో గుట్కా విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. పోలీసుల కళ్లుగప్పి కొంతమంది వ్యాపారులు భారీగా గుట్కాను అక్రమ మార్గంలో దిగుమతి చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఏజెంట్లను నియమించుకుని పెద్దమొత్తంలో సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు గుట్కాను తరలిస్తున్నారు.

నిషేధం ఉన్నా.. నిరంతరం నిఘా ఉండే భువనగిరి పట్టణంలోని పోలీసుల కళ్లు గప్పి గుట్కా దందా సాగిస్తున్నారు. గంజ్‌మార్కెట్‌తో పాటు, ఇతర ఏరియాలకు రాత్రి వేళలో ఎక్కువగా గుట్కా సంచులు సరఫరా అవుతున్నాయి. భువనగిరి పట్టణంలో గతంలో ఈ వ్యాపారం చేసిన వారు పోలీసులకు అనుమానం రాకుండా ఇతరుల దుకాణాలలో సంచులను నిల్వ చేస్తున్నారు. భారీగా డబ్బులు వస్తాయనే ఆశతో వ్యాపారులు అక్రమ దందాకు మొగ్గుచూపుతున్నారు. అడపాదడపా పోలీసులు దాడులు చేసినా కొద్దిమొత్తం మాత్రమే సరకు దొరుకుతోంది. నిల్వ ఉంచి ఎవరికి అనుమానం రాకుండా పరిచయం ఉన్న వ్యక్తులకే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అనుమానితులు గుట్కా అడిగితే లేదని చెబుతారు. వ్యాపారులకు తెలిసిన వారితో చెప్పిస్తే కానీ కొత్త వారికి అమ్మడానికి ముందుకు రారు. గుట్కా కేసుల్లో దొరికినా సులువుగా బయటికి వచ్చి మళ్లీ అదే వ్యాపారం కొనసాగిస్తున్నారు. రెండేళ్ల కిత్రంతో పోల్చితే గుట్కా కేసుల నమోదు తగ్గింది. భువనగిరి పట్టణంతో పాటు జిల్లాలోని ఇతర మండల కేంద్రాల్లో కూడా గుట్కా వ్యాపారం సాగుతోంది.

పట్టణంలోని హోల్‌సేల్ దుకాణాదారుల దగ్గర గ్రామాల్లో ఉండే చిరు వ్యాపారులు, పాన్, టీ దుకాణాదారులు సరకు తెచ్చుకుని బహిరంగంగానే అమ్ముతున్నారు.

నిఘా పెంచాంనిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా వ్యాపారంపై నిఘా పెంచాం. సమాచారం మేరకు దాడులు చేసి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన కేసుల్లో జిల్లాకు సరఫరా చేసే ఏజెంట్లపై నిఘా ఉంచాం. విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలి. రవికిరణ్‌రెడ్డి, ఏసీపీ, భువనగిరి

# బౌద్ధక్షేత్రం.. అభివృద్ధి గగనం

పెద్దపల్లి : కరీంనగర్ నుంచి 30 కి.మీ..పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో ప్రఖ్యాత బౌద్ధస్తూపం ఉంది. శాతవాహనులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారనేందుకు ఇక్కడున్న శిథిలమైన కోటలు తార్కాణంగా నిలుస్తున్నాయి. ధూళికట్ట, వడ్కాపూర్ గ్రామాల సరిహద్దులో హుస్సేన్‌మియా వాగు తీరంలో కొలువైన ఈ ప్రాంతానికి మహర్దశ లభించేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోనుంది. రాష్ట్రంలోని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించాలని ఇటీవల జరిగిన ముఖ్య అధికారుల సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే ఈ క్షేత్రం పర్యాటకధామంగా మారడమే కాకుండా రెండు మండలాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక ప్రజలు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'స్వదేశీ దర్శన్' పథకం కింద చేపట్టబోయే పలు బౌద్ధ పర్యాటక క్షేత్రాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అభివృద్ధి చేసే జాబితాలో జిల్లాలోని ఈ క్షేత్రాన్ని చేర్చి త్వరితగతిన నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో 'ఈనాడు' ప్రస్తావించగా పర్యాటకాభివృద్ధి ప్యాకేజీ కోసం ఇటీవల రామగిరిఖిల్లా, సబ్బితం జలపాతాలకు నిధులు కేటాయించాలని నివేదించామన్నారు. బౌద్ధస్తూపం అభివృద్ధికి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం ఆదేశిస్తే పర్యాటకాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు.

**మౌలిక వసతులు కల్పించాలి**

స్తూపం వద్దకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. కనీసం విద్యుత్తు దీపాలు లేవు. స్తూపంపై గడ్డి మొలిచి పూర్తిగా కప్పేయడంతో చారిత్రక ఆనవాళ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. ఏటా జరిగే ఉత్సవాలకు వచ్చే విదేశీ పర్యాటకులు ఇక్కడి అసౌకర్యాలపై ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, మ్యూజియం, పార్కులు, వసతి సదుపాయాలు కల్పించాలి.

పూదరి చంద్రయ్య గౌడ్

**అతిపెద్ద స్తూపం**

ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్దదైన ఈ బౌద్ధస్తూపాన్ని సందర్శించడానికి మే నెలలో నిర్వహించే బుద్ధజయంతి సందర్భంగా థాయ్‌లాండ్, అమెరికా, చైనా, నేపాల్ లాంటి దేశాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, పశ్చిమబెంగాల్, హైదరాబాద్ నుంచి సందర్శకులు, బౌద్ధ భిక్షువులు, పెద్దఎత్తున తరలి వస్తుంటారు.

శాతవాహనుల వీరత్వంతో పాటు మహనీయుడైన గౌతమబుద్ధుడి జీవిత విశేషాలను తెలుసుకునేందుకు ఈ ప్రాచీన కట్టడం ఇప్పటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. కాగా ఇక్కడికి వెళ్లేందుకు సరైన రవాణా వసతి లేదు. ధూళికట్ట, వడ్కాపూర్ గ్రామాల నుంచి 3 కిలోమీటర్ల మేర వర్షాకాలంలో కాలినడకన, ఎడ్లబండ్లపై, ఇతర రోజుల్లో ద్విచక్రవాహనంపైనే వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి.

ప్రభుత్వం నూతన పర్యాటక పాలసీలో భాగంగా దేశ, విదేశాల్లోని బౌద్ధులను ఆకర్షించేలా జిల్లాలోని ఈ క్షేత్రం వద్ద డిజిటల్ మ్యూజియం, ప్రదర్శన శాల, శాసనాల సమాచారం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

2002 సంవత్సరం నుంచి బుద్ధజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. క్రీ.శ 2వ శతాబ్దంలో శాతవాహనుల కాలంలో నిర్మించారని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. పురావస్తుశాఖ 1972లో తవ్వకాలు చేపట్టి స్తూప విశేషాలను వెల్లడించాలనే ఉద్దేశంతో పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ అనంతరం పట్టించుకోలేదు.

ఇక్కడ ఎలాంటి భద్రత, పర్యవేక్షణ లేదు. గుప్తనిధులు ఉన్నాయనే కారణంతో పలువురు కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. రాత్రివేళల్లో తవ్వకాలు జరుపుతూ చారిత్రక ఆధారాలను ధ్వంసం చేస్తున్నారు. అయిదేళ్ల క్రితం పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల్లో బౌద్ధశిల్పాలు, శాతవాహనులు కొలిచిన శిల్పాలను వెలికితీసి కరీంనగర్ జిల్లాలోని పురావస్తు శాఖ మ్యూజియంలో భద్రపరిచారు.

# స్థానిక ఎన్నికలు ఇప్పట్లో లేనట్టేనా..!

నాంపల్లి : గడువు తీరిన గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఎన్నికలకు మరికొంత కాలం వేచిచూడక తప్పేలా లేదు. 'రాబోయే మూడు, నాలుగు నెలల్లో బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ సభలో పేర్కొన్నారు.' దీంతో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా అని ఆతృతగా ఎదురు చూస్తున్న ఆశావహుల ప్రయత్నాలపై నీళ్లు చల్లినట్లయింది. గత ఎనిమిది నెలలుగా ప్రజలతో మమేకమై స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న వీరి కథ మళ్లీ మొదటికొచ్చినట్లయింది.

**రిజర్వేషన్లపై ఆసక్తి..**

కులగణన ద్వారా రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాలస్థాయి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాపై లెక్కలు తీసి రిజర్వేషన్ల నిర్ధారణ అనేది సుదీర్ఘ కసరత్తుతోపాటు చాలా రోజులు పట్టనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ 2025లోనే జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీసీ కులగణనపై సీఎం ప్రకటన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ నేపథ్యంలో గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'పంచాయతీ రాజ్ చట్టం-2018' అమలుపై సందిగ్ధం నెలకొంది. ఒక వేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముందనే చర్చ రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. ఇదే జరిగితే పాత రిజర్వేషన్ల ప్రాతిపదికన గత ఎనిమిది నెలలుగా ఎదురుచూస్తున్న ఆశావహుల ఆలోచనలు తారుమారయ్యే అవకాశం ఉండటంతో స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఆసక్తి నెలకొంది.

ఓటరు జాబితా ప్రచురణతో..గత ఫిబ్రవరి 1న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణన డిమాండ్ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు మరింత ఆలస్యమయ్యాయి. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ఓ అడుగు ముందుకేసి సెప్టెంబరు 28 వరకు తుది ఓటరు జాబితా ప్రచురణ, ఇతరత్రా పనులు ముగించాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించింది. దీంతో త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతోందనే సంకేతాలు రావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఇటీవలి సీఎం ప్రకటనతో వచ్చే కొత్త సంవత్సరంలోనే స్థానిక పోరు ఉంటుందనే చర్చ జోరందుకుంది.

# పల్లె వెలుగులోనూ ఆన్‌లైన్ సేవలు




గోదావరిఖని : సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న టీజీఎస్ ఆర్టీసీ.. ప్రయాణికులు మరింత సులభంగా ఛార్జీలు చెల్లించేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటికే సూపర్‌లగ్జరీ ఆపై స్థాయి సర్వీసులకు క్యూఆర్ స్కానర్ ద్వారా ఛార్జీలు స్వీకరిస్తున్న ఆర్టీసీ.. పల్లెవెలుగుతోపాటు ఎక్స్‌ప్రెస్‌లలో సైతం అమలు చేసేందుకు చర్యలు ముమ్మరం చేసింది. 'ప్రగతి రథం.. ప్రజాసేవా పథం' అనే నినాదంతో ముందుకు సాగుతున్న సంస్థ.. ప్రస్తుతం సీట్ల రిజర్వేషన్, డిజిటల్ లావాదేవీలను అమలు చేస్తోంది.

**సమస్యలనూ ఫిర్యాదు చేయవచ్చు..**

మరోవైపు ప్రస్తుత కాలంలో దాదాపు చాలామంది ప్రయాణికులు స్మార్ట్‌ఫోన్ వాడుతున్నారు. దీంతో ప్రయాణానికి సంబంధించిన సమస్యలను సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేసేందుకు, అలాగే ప్రయాణించే బస్సు ఎక్కడుందో తెలుసుకునేందుకు మరో క్యూ ఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టనుంది.

**అన్ని రకాల సేవలు..**

ఆర్టీసీ ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్‌తో అన్ని రకాల సేవలను పొందవచ్చు. ఒక్కసారి స్కాన్ చేస్తే ఆర్టీసీకి సంబంధించిన పది రకాల యాప్‌లు వినియోగించుకునే అవకాశముంది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్(వెబ్‌సైట్), గమ్యం(ఆండ్రాయిడ్ ఐఓఎస్), ఆన్‌లైన్ బుకింగ్ తదితర సేవలను పొందవచ్చు. ఇందులో ఏది అవసరమైతే దాన్ని ఎంచుకుకోవడంతోపాటు మన వివరాలు పొందుపరిస్తే ఎక్కడైనా వినియోగించుకోవచ్చు.

**ఉమ్మడి జిల్లాలో 811 సర్వీసులు**

ఉమ్మడి జిల్లాలో 11 డిపోలకు సంబంధించి 811 సర్వీసులు నడుస్తున్నాయి. 479 ఆర్టీసీ, 332 అద్దె బస్సులు నడుపుతున్నారు. ఆర్టీసీ నడిపే అన్ని సర్వీసులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఏ బస్సు ఎక్కడుంది? బోర్డింగ్ పాయింట్ నుంచి ప్రయాణించే బస్సు ఏ రూట్‌లో వెళ్తుంది? ఎంత సమయానికి గమ్యం చేరుకుంటుందన్న వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశముంది. దీనికి తోడు మరింత సాంకేతికను జోడించి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు క్యూఆర్ విధానాన్ని తీసుకువస్తున్నారు.

**ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలి**

సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి. సులభతరంగా ఛార్జీలు చెల్లించేందుకు త్వరలోనే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో క్యూఆర్ కోడ్‌ను అమలు చేయనున్నాం. నాగభూషణం, గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్

# అమలులోకి ధరల పెంపు



జగిత్యాల : ఉమ్మడి జిల్లా రైతులు పండించే వివిధ పంట ఉత్పత్తులకు ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) సెప్టెంబరు నుంచి అమల్లోకి రానుండగా ఈ ధరలు ఏడాది పాటు వర్తిస్తాయి. నీటి లభ్యతతో ఈ వానాకాలంలోనూ 9.50 లక్షల ఎకరాల్లో వరి ప్రధాన పంటగా ఉండగా ప్రభుత్వం సన్నాలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను ఇస్తామనటంతో ఈ సీజన్‌లో సన్నగింజ రకాలను 42 శాతం విస్తీర్ణంలో సాగుచేశారు. గతంలో మాదిరిగా లావుగింజ రకాలతో పాటుగా సన్నగింజ రకాలను రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతులకు కనీస మద్దతు ధరలు దక్కుతాయి.

**ప్రభుత్వ సంస్థల సేకరణకు మద్దతు ధర**

దొడ్డుగింజ ధాన్యం, మక్కలు, కందులు, సెనగలు, సోయాబీన్, మినుములు తదితర ఉత్పత్తులను ప్రభుత్వం గత సీజన్లలో కొనుగోలు చేయగా ప్రభుత్వ రంగ సంస్థల సేకరణతో కనీస మద్దతు ధర చెల్లిస్తారు. సన్నగింజ వరిరకాల సేకరణ, బోనస్ చెల్లింపుపై మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

**ఇలా చేస్తేనే మేలు**

పత్తిని 1.80 లక్షల ఎకరాల్లో సాగుచేస్తుండగా సీసీఐ ద్వారా కేవలం 2-15 శాతం పంటనే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన దూదిని రైతులు మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

మార్కెట్లో పత్తికి ధర తగ్గితే సీసీఐ సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాల్సి ఉంది. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతు ధర దక్కటం లేదు.

మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంటుంది.

వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణనూ చేపట్టాల్సి ఉంటుంది.

పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధరను ప్రకటించనందున విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది.

పదేళ్ల తరువాత ఇటీవల పసుపు పంటకు మంచి ధర లభించగా మున్ముందు ధర తగ్గితే పసుపును కూడా గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, గిట్టుబాటుకాని పంటలకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌లో మద్దతు కన్నా ధర తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్ జోక్య పథకం ద్వారా సదరు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధరలతో కనీస మొత్తం చేతికంది, ఆర్థిక ఆసరా లభిస్తోంది.

# నిధులు రావు వృథా ఆగదు

ఎగువమానేరు : ఈ ఏడాది వర్షాకాలం సీజన్ ప్రారంభమైన మూడు నెలల వరకు సమృద్ధిగా వర్షాలు లేక జలాశయాలకు నీరు చేరలేదు. పంటలకు సాగునీటి విడుదలపై అప్పటి వరకు అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల మొదటి వారం అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని భారీ, మధ్య, చిన్నతరహా జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. పురాతన జలాశయం నర్మాలలోని ఎగువమానేరు కుడికాల్వ షట్టర్ల లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. ఇదొక్క జలాశయంలోనే కాదు. నిమ్మపల్లి, నక్కవాగు, చంద్రవంక జలాశయాల్లోనూ తూములు, కాల్వల షట్టర్ల వద్ద దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరిసాగు విస్తీర్ణం 70 శాతం పైన ఉంది. ఇటీవల వర్షాలకు మెట్టప్రాంతమైన జిల్లాలో 2.14 మీటర్ల మేర భూగర్భజలాలు పైకి వచ్చాయి. సగటున 8.15 మీటర్లలో భూగర్భ జలాలున్నాయి. ప్రధానంగా వరి పంటకు నెల రోజులు మాత్రమే నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. జలాశయాలకు ఉన్న నీటి నిల్వలకు లీకేజీలను పూర్తిస్థాయిలో నిలువరించ గలిగితే వచ్చే యాసంగి పంటలకు ఢోకా ఉండదు. లేకుంటే యాసంగి సీజన్‌లో సాగునీటి కష్టాలు తప్పవు.

ఎగువమానేరు జలాశయం షట్టర్ల ద్వారా లీకేజీల రూపంలో సుమారు వంద క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ రెండు టీఎంసీలకు పూర్తిస్థాయిలో ఉంది. దీని పరిధిలో 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఏడాది పొడవునా పూర్తిస్థాయి నీటి నిల్వ ఉంటే సాగు విస్తీర్ణం రెండింతలు పెరుగుతుంది.

నిజాం కాలంలో నిర్మించిన ఎగువమానేరు జలాశయం పూర్తిస్థాయి ఆధునికీకరణకు మూడేళ్లుగా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నారు. ఆర్థిక సంవత్సరం మారినప్పుడల్లా ప్రతిపాదనలు రివైజ్ చేయడం మినహా నిధులు విడుదల ఊసేలేదు.



ఎగువమానేరు, నిమ్మపల్లి, నక్కవాగు, చంద్రవంక జలాశయం ఆయకట్టు రైతులంతా కలిసి బాగుచేసుకుందామంటే పురాతనమైన కట్టడాలు కావడంతో షట్టర్ల వద్ద పనులు చేయలేని పరిస్థితి. ఇక జలాశయం కుడి, ఎడమ కాల్వల్లో పూడుకుపోయిన తూములను, పేరుకుపోయిన మట్టిని అక్కడక్కడ రైతులు శ్రమదానంతో తొలగిస్తున్నారు. నీరు వృథాగా పోతున్నా అందుబాటులో ఉన్న వనరులతో అధికారులు మమ అనిపించాల్సిన పరిస్థితి నెలకొంది.

తూము షట్టర్ల మరమ్మతులు, ఆయిలింగ్, గ్రీజింగ్ పనులకు నిధుల కొరత ఏర్పడింది. ఓఅండ్‌ఎం బిల్లులు రావడం లేదని ఇటీవల నీటిపారుదలశాఖ ఇంజినీర్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని కోరారు. దీంతో నీటిపారుదలశాఖలో ఓఅండ్‌ఎం పనులకు బడ్జెట్ పెంచినట్లు సమాచారం.

**నిధులు వస్తే పనులు చేయిస్తాం**

వర్షాలకు దెబ్బతిన్న నీటివనరులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. కొన్నింటికి తాత్కాలికంగా మరమ్మతులు చేయించాం. నిధులు వస్తే పూర్తిస్థాయిలో పనులు చేయించి లీకేజీలు కాకుండా చూస్తాం. అమరేందర్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదలశాఖ

# రహదారి విస్తరణకు మార్గం సుగమం

ధర్మపురి : నిజామాబాద్ - జగ్దల్‌పూర్ 63వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వే పనులు ఇప్పటికే పూర్తిచేసిన అధికారులు.. భూ సేకరణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అభిప్రాయాలు సైతం సేకరించారు. దీంతో తుది నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం చేశారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా.. మంచిర్యాల సెక్షన్ పరిధిలో 131.8 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు.

మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, హాజీపూర్ పట్టణాల గుండా గతంలో నిర్వహించిన సర్వేల ప్రకారం రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా.. జనావాసాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, దుకాణ సముదాయాల కారణంగా అభ్యంతరాలు వెల్లువెత్తడంతో రహదారిని కొద్దిగా మార్పులు చేసి బైపాస్ చేశారు. ఇప్పటికే సర్వే పూర్తి కాగా భూ రికార్డుల్లో లోపాలను సవరించి తుది నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు.

**పరిగణనలోకి పలు అంశాలు..**

రహదారి విస్తరణలో భాగంగా గత నెలలో ధర్మపురి, బుగ్గారం కేంద్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్ మణికుమార్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా పర్యావరణం, సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదికలను రూపొందిస్తున్నారు.

**కోల్పోనున్న 112 ఎకరాలు..**



బుగ్గారం మండలంలో సిరివంచకోట, బుగ్గారం, గోపులాపూర్, మద్దునూర్ గ్రామాల నుంచి.. ధర్మపురి పరిధి రాయపట్నం, స్తంభంపల్లి శివారు వరకు రహదారిని నిర్మించేలా రూపకల్పన చేశారు. దీంతో మొత్తం 112 ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తోందని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే రైతులకు ఇచ్చిన నోటీసుల్లో ఉన్న భూమికి, క్షేత్ర స్థాయిలో తేడా ఉందని రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

**అన్నదాతల ఆవేదన..**

రహదారి విస్తరణ సందర్భంగా తమ విలువైన భూములు కోల్పోతున్నందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి ధర బహిరంగ మార్కెట్‌లో ఎకరం కనీసం రూ.30 నుంచి రూ.40 లక్షల ధర పలుకుతోంది. ప్రభుత్వం పరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు ఇంతకాలం భూమినే నమ్ముకొని జీవించిన తమకు ఉపాధి ఉండదని వాపోతున్నారు.

**లోపాలను సవరిస్తాం..**రైతుల నుంచి వచ్చిన భూ సాంకేతిక సమస్యలను పరిష్కరించి.. వారం, పది రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముంది. అన్ని లోపాలను పూర్తిగా సవరిస్తాం. రైతుల నుంచి వచ్చిన ప్రతి విషయాన్ని పరిశీలించిన తర్వాతే నోటిఫికేషన్ జారీ చేస్తాం. తహసీల్దార్ కృష్ణ చైతన్య

# నిధుల కోసం నిరీక్షణ

జగిత్యాల : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో పెద్దఎత్తున ఆయకట్టు స్థిరీకరణ పనులకు ఇటీవల అధికారులు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రతిపాదిత పనులకు నిధులు విడుదలచేసేలా ప్రజాప్రతినిధులు కృషిచేస్తే వేసవిలోపు పనులు ముగిసి వచ్చే వానాకాలం నుంచి జిల్లాలోని ఆయకట్టేతర ప్రాంత రైతులకూ లాభం కలిగే అవకాశముంది.

ప్రతిపాదిత పనులు:శ్రీరామసాగర్ మిగులు జలాలను దిగువకు తరలించేలా, దిగువనుంచి ఎల్లంపల్లి జలాలను శ్రీరామసాగర్‌లోకి ఎత్తిపోసేలా వినియోగిస్తున్న వరదకాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్ నిర్మించి 52.30 కి.మీ వద్ద ఓటీద్వారా నీటిని తీసుకుని కలికోట సూరమ్మ చెరువు, లక్కాకుల, తుమ్మల చెరువులను నింపాలి.

రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేట వద్ద పంపుహౌస్‌లు నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.

వరదకాలువ 47.600 కి.మీ వద్ద ఎడమకాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపటం ద్వారా కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది. 76.22 కి.మీ మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. గొర్రెగుండం గుడిచెరువు వద్ద పంపుహౌస్‌తో నల్లమట్టు చెరువును నింపవచ్చు. ఈ ప్రధాన పనులతో పాటుగా కొడిమ్యాల మండలంలో పలు నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ తదితర పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీరణను రూ.136 కోట్లతో చేపట్టగా మిగులు పనులను పూర్తిచేయాలి. మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.120 కోట్లవరకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. దీనిపై నీటిపారుదలశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపాదిత నిర్మాణాలు, అవసరమున్న మరమ్మతుకు దశలవారీగా నిధులు విడుదల అవుతాయన్నారు. జిల్లాలో 35 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తలపెట్టగా 11 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.57.07 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలో ఆపరేషన్, నిర్వహణ, మరమ్మతు నిమిత్తం 130 పనులకు అనుమతులు రాగా పనుల పూర్తికి ఇంకా రూ.17.41 కోట్లు విడుదల చేయాల్సిఉంది.

వరదకాలువ 67.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్‌కాలువను నింపటంద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది. ప్రధానంగా 8 పనులను రూ.805.31 కోట్లతో చేపట్టడం ద్వారా అదనంగా 54,215 ఎకరాల భూమికి సాగునీరందిి ఆయకట్టు పరిధిలోకి వస్తుంది. 59.500 కి.మీ వద్ద కుడికాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది.





# లడ్డూ సీక్రెట్ ఇప్పుడు చంద్రబాబు బయటపెట్టడం వెనక అంత స్కెచ్ ఉందా?

తిరుమల లడ్డూకి వినియోగించేది జంతువుల కొవ్వా? ఆవు నెయ్యా? ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత భక్తుల్లో నెలకొన్న ప్రశ్న ఇది. ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వినియోగించారని మండిపడ్డారు సీఎం చంద్రబాబు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఇక లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు టీటీడీ మాజీ ఛైర్మన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. దీనిపై తన కుటుంబంతో సహా ప్రమాణం చేయడానికి సిద్ధమేనని చంద్రబాబుకు సవాల్ విసిరారు వైవీ సుబ్బారెడ్డి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఇన్ని రోజుల తర్వాత చంద్రబాబు ఈ లడ్డు వ్యవహారం తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశం అయింది. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగా, జూన్ 22న తిరుమల అక్రమాలపై విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్తున్నారు. జూలై 7న నెయ్యి అక్రమాలు గుర్తించామని, జూలై 15న ఎన్డీడీబీ నివేదికలో లడ్డూలో జంతువుల కొవ్వు కలిసినట్లు తేలిందని చెప్తున్నారు. అయితే దాదాపు రెండు నెలల తర్వాత అంటే రెండు రోజుల క్రితం చంద్రబాబు తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినట్టు తెరపైకి తీసుకురావడం అందరిలో అనేక అనుమానాలు కలిగిస్తున్నాయి. రెండు నెలల తర్వాత ఈ మేటర్ చంద్రబాబు తెరపైకి తీసుకురావడం వెనక పెద్ద స్కెచ్చే ఉందని అంటున్నారు. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ రెండు రోజుల క్రితం ఆమోద ముద్ర వేసింది. త్వరలో పార్లమెంట్ లో ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈసారి జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ అంశాలే రాష్ట్ర ఎన్నికల అజెండాగా మారడం, లేదా రాష్ట్ర ఎన్నికల అజెండాలో అంశాలు జాతీయ అజెండాకు చేరడం ఖాయం. జగన్ దూకుడుకు కళ్లెం వేయాలంటే ఏదో ఒక కీలక అస్త్రం చంద్రబాబుకి అవసరం కాబట్టి, ఇప్పుడు రాష్ట్రంలో అంశాల్ని సైతం జాతీయ స్థాయికి తీసుకెళ్లి ఇండియా కూటమి పార్టీల మద్దతు పొందిన జగన్ ని అక్కడి పార్టీలు కూడా వద్దనుకునేలా చంద్రబాబు లడ్డూ వ్యవహారం ఇప్పుడు తెరపైకి తీసుకొచ్చారనే టాక్ నడుస్తుంది. చంద్రబాబు ఊహించినట్లుగానే ఇప్పుడు ఎన్డీఏ కూటమితో పాటు విపక్ష ఇండియా కూటమిలోని కాంగ్రెస్ సైతం లడ్డూ వ్యవహారంపై విమర్శలు గుప్పిస్తోంది. మరి దీనిని జగన్ ఎలా ఎదుర్కొంటారా అన్నది చర్చనీయాంశంగా మారింది.





# ఏపీ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎన్టీఆర్

హైదరాబాద్: ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'దేవర' స్పెషల్ షోలతో పాటు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కథానాయకుడు ఎన్టీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. "గౌరవనీయులైన సీఎం చంద్రబాబు నాయుడుగారు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌గారికి ధన్యవాదాలు. 'దేవర' మూవీ విడుదల నేపథ్యంలో టికెట్ ధరలు, స్పెషల్ షోల ప్రదర్శనకు అనుమతి ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తెలుగు సినిమాకు సహకారం అందిస్తున్న మీకు కృతజ్ఞతలు. సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌గారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా" అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు 'దేవర' మూవీ విడుదల రోజు అర్ధరాత్రి 12 గంటల షోతో పాటు ఆరు ఆటలకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. 28వ తేదీ నుంచి ఐదు ఆటలకు పర్మిషన్ ఇచ్చింది. అలాగే టికెట్ ధరలను సైతం పెంచుకోవడానికి వెసులుబాటు కల్పించింది. సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలిసి అప్పర్ క్లాస్ రూ.110, లోవర్ క్లాస్ రూ.60, మల్టీప్లెక్స్ రూ.135 వరకూ పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. మరోవైపు తెలంగాణలోనూ స్పెషల్ షోలు, టికెట్ ధరలకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. తొలిరోజు అర్ధరాత్రి 1 గంట షోకు అనుమతివ్వడంతో పాటు, రోజూ ఆరు ఆటలను 14 రోజుల పాటు ప్రదర్శించేందుకు అంగీకరించారట. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంపునకు అనుమతి కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# ఆ విషయం డైవర్ట్ చేసేందుకు విజయసాయిరెడ్డి ట్వీట్లు: బుద్దా వెంకన్న..

విజయవాడ: తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం నుంచి ప్రజల్ని డైవర్ట్ చేసేందుకు ఎంపీ విజయసాయిరెడ్డి వరస ట్వీట్లు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత బుద్దా వెంకన్న మండిపడ్డారు. విజయసాయి రెడ్డి గుంట నక్కలా వ్యవహరిస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై ట్విటర్ వేదికగా మ్నెరుగుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత జగన్ వైఖరి, నియంతృత్వ పోకడలు భరించలేక ఆ పార్టీని నేతలు వీడుతున్నారని వెంకన్న ఎద్దేవా చేశారు. ట్విటర్‌లో ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఎందుకు పోస్టులు పెడుతున్నావో అందరికీ తెలుసంటూ విజయసాయిరెడ్డిపై బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.




**అందుకే రూ.350కోట్లు..** ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.."తప్పుడు లెక్కలు రాసినందుకు నువ్వు(విజయసాయిరెడ్డి) 16నెలలపాటు జైలులో ఉన్నావు. అలాంటి నువ్వు మాకు నీతులు చెబుతావా?. వైసీపీ అధినేత జగన్‌కు జైలులో రూమ్ మేట్‌వి. అందుకే నీకు రాజ్యసభ సీటు ఇచ్చారు. శాంతి నివాసంలో కూర్చుని ట్విటర్‌లో పోస్టులు పెట్టడం కాదు. దమ్ము, ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలి. వరద విపత్తుకు స్పందించి రూ.350కోట్లు సిఎం రిలీఫ్ పండ్‌కు విరాళాలు వచ్చాయి. సీఎం చంద్రబాబుపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు పెద్దఎత్తున ముందుకు వచ్చారు. జగన్ అధికారంలో ఉంటే మిమ్మల్ని నమ్మి ఎవరైనా రూపాయైనా ఇచ్చేవాళ్లా? మీరు దొంగలు కాదు.. గజ దొంగలు. అందుకే ఎవరూ నమ్మడం లేదు.

**జగన్‌కు బోడి గుండు..** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని 151స్థానాల నుంచి 11సీట్లకు ప్రజలు పరిమితం చేసినా సిగ్గు రావడం లేదు. నీతోపాటు దేవినేని అవినాశ్, కొడాలి నాని, పేర్ని నాని వంటి నేతల్ని ఏ పార్టీ చేర్చుకోదు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేసే ముందు, ఆ తర్వాత టీడీపీకి ఎంత గ్రాఫ్ పెరిగిందో తెలుసుకో. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేశ్ నాయకత్వంలో పని చేసేందుకు క్యాడర్ సిద్ధంగా ఉంది. నీతోపాటు మీ పార్టీ అధినేత జగన్, మరికొంతమంది వైసీపీ నేతలు త్వరలో జైలుకు వెళ్తారు. లోకేశ్ సీనియర్లపై గుర్రుగా ఉన్నారని ఎవరైనా నీకొచ్చి చెప్పారా?. నువ్వు గుంట నక్కవి.. నీకు లోకేశ్ గురించి మాట్లాడే కనీస అర్హత లేదు. అవినీతికి ఆమడ దూరంలో ఉండే వ్యక్తి లోకేశ్. ఎక్కడైనా అవినీతి చేసి దోచుకునే వ్యక్తి జగన్. ఆ 11స్థానాలూ ఇవ్వకుండా ఉండాల్సిందని ఇప్పుడు ఏపీ ప్రజలు భావిస్తున్నారు. క్షవరం అయితే గానీ వివరం రాదని పెద్దలు చెప్పినట్లు.. ప్రజలు జగన్‌కు బోడి గుండు కొట్టారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ప్రజల మధ్యకు, మీడియా ముందుకు రాని జగన్ ఇప్పుడు వస్తున్నారు.

**చిప్పకూడుకు సిద్ధంగా ఉండు..** వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కలిసి నడిచినప్పుడు విజయసాయిరెడ్డి ఎక్కడ ఉన్నారు. అలాంటి సీనియర్లు జగన్‌ను ఛీ కొట్టి బయటకు వెళ్లిపోతున్నా.. మీకు మాత్రం సిగ్గు రావడం లేదు. ఏపీలో వైసీపీ కథ ముగిసింది. 11మంది ఎమ్మెల్యేల్లో 10మంది టీడీపీ వైపు చూస్తున్నారు. విజయసాయిరెడ్డి.. నీకు సవాల్ చేస్తున్నా. ట్వీట్లు కాదు.. దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి బహిరంగ చర్చకు రా. మీరు చేసిన దాడులు, దారుణాలపై జైలుకు వెళ్లేందుకు సమయం దగ్గర పడింది. త్వరలోనే జైలులో మళ్లీ చిప్పకూడు తినడానికి సిద్ధంగా ఉండండి. ఇంకోసారి గుంటనక్క వేషాలు వేస్తే తగిన విధంగా బుద్ధి చెబుతాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కమీషన్ల కోసం కక్కుర్తిపడి దేవదేవుడి ప్రసాదాన్ని కల్తీ చేశారు: కిరణ్ రాయల్

తిరుపతి: శ్రీవారి లడ్డూల్లో నెయ్యి కల్తీపై ఎస్పీకి జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ మాట్లాడారు. తిరుమల పవిత్రతను, ప్రసాదాన్ని అపవిత్రం చేశారని ఆరోపించారు. అపవిత్రం చేసిన జగన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి దేవదేవుడి ప్రసాదాన్ని కల్తీ చేశారని చెప్పారు. తిరుమల ఆలయాన్ని, శ్రీవారి పోటును సంప్రోక్షణ చేయాలని కోరారు. కల్తీ నెయ్యి కొనుగోళ్లలో మాజీ ఈవో ధర్మారెడ్డి కీలకమన్నారు. మాజీ ఛైర్మన్, తితిదే ఉన్నతాధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.






పెద్దపులిపాక: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపవిత్ర పదార్థాలు వాడారని తెలిసి ఎంతో వేదన చెందినట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పెద్దపులిపాకలో హిందూ దేవాలయాల పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు మాట్లాడారు. "ప్రసాదంలో ఏం కలుస్తుందోనన్న భయంతో భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అపవిత్ర పదార్థాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలి. స్వామి సన్నిధిలో వేరే మతస్థులకు ఉద్యోగం ఉండకూడదు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలు ఉన్నవారికే ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వం, ప్రజలు కలిసి ధర్మాన్ని రక్షించాలి. ల్యాబ్ నివేదికలు మనకు ఆధారం.. అవి స్పష్టం చేసినప్పుడు చర్యలు తీసుకోవాల్సిందే. ఇంకా తప్పు జరగలేదంటే అపహాస్యమే అవుతుంది. ల్యాబ్‌లు ఇచ్చిన నివేదిక ప్రకారం కోర్టుకు వెళ్లాల్సిందే. కోర్టు విధించిన శిక్షలు అమలు చేస్తేనే ఇలాంటివి మరోసారి జరగకుండా ఉంటుంది" అని స్పష్టం చేశారు.

# వైసీపీ హయాంలో అంతా మాయ..




వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆలయాలను ఆదాయ వనరుగా మార్చుకుందా.. నాయకుల జేబులను నింపుకోవడానికి ప్రసాదాల తయారీలో మోసాలకు పాల్పడిందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భక్తుల విశ్వాసాలను పణంగా పెట్టి రాజకీయాలను చేసింది. తిరుపతి లడ్డూ వివాదంతో రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లోని ప్రసాదాల తయారీలో అవకతవకలు బయటకు వస్తున్నాయి. అధికారం ఉందనే అహంకారంతో వైసీపీ నేతలు సాగించిన అరాచకాలు బయటపడుతున్నాయి. వైసీపీ నేతలు చెప్పడంతో ప్రసాదాల తయారీకి సరఫరా చేసే సరుకుల్లో తేడాలున్నా అధికారులు సైలెంట్ అయిపోయిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఆలయాల్లో భక్తుల సమస్యలు పట్టించుకోవడం పక్కనపెట్టి.. సొంత జేబులను నింపుకోవడానికే వైసీపీ నేతలు, ఆ పార్టీకి వంతపాడుతున్న అధికారులు ఐదేళ్లు పనిచేసినట్లు తెలుస్తోంది. తిరుపతి లడ్డూ వివాదం బయటకు రావడంతో.. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో అవకతవకలపై నోరు విప్పుతున్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడైనా ఈ విషయాన్ని బయటకు చెబుదామని ప్రయత్నించినా బెదిరించేవారని, దీంతో నోరు మెదపని పరిస్థితి నెలకొందని కొందరు వాపోతున్నారు. ఆలయాల్లో వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలను పెంచి పోషించిందనే విషయం స్పష్టమవుతోంది. తాజాగా శ్రీశైలంలోని మల్లన్న క్షేత్రంలో ప్రసాదంలో ఉపయోగించిన వస్తువుల్లో మోసాలు, నాణ్యతా లోపాలపై దర్యాప్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**ప్రసాదంలో కమీషన్లు..! :** భక్తులు దేవుడి ప్రసాదాన్ని ఎంతో అపురూపంగా భావిస్తారు. ఆలయానికి వెళ్తే అక్కడ లభించే ప్రసాదాన్ని తీసుకోకుండా రారు. అటువంటి ప్రసాదంలోనే కల్తీకి పాల్పడ్డ ఘటనలు బయటకు వస్తున్నాయి. శ్రీశైలం మల్లన్న క్షేత్రంలోని ప్రసాద ం తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు నాణ్యతపై భక్తులు నుంచి ఎన్నో ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ చర్యలు శూన్యం. వైసీపీ నేతలకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఎ లవన్నను వైసీపీ ప్రభుత్వం 2021లో శ్రీశైల దేవస్థానం ఈవోగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన కొన్నాళ్లకు లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, జీడిపప్పు వంటి పదార్థాల కొనుగోలు నాణ్యతపై వివాదాలు రేగాయి. ప్రస్తుతం శ్రీశైలం ప్రసాదం తయారీలో నాణ్యతలేని వస్తువులు సరఫరా చేసిన ఘటనపై దర్యాప్తు చేయాలని భక్తులు కోరుతున్నారు.

**అంతా వాళ్ల ఇష్టం..** అప్పటి ఈవో లవన్న ఆమోదించిన ప్రైవేటు సంస్థ దిగుమతి చేసిన నెయ్యి సరఫరాలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వచ్చాయి. క్యాన్లపై బ్యాచ్ నంబరు, వరుస సంఖ్యతో కూడిన స్టిక్కర్‌ను జత చేస్తారు. చాలా క్యాన్లను బ్యాచ్ నంబర్లు లేకుండా సరఫరా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పెద్దల ఆశీస్సులతో వచ్చిన ఈవో అండదండలు నెయ్యి సరఫరా సంస్థకు ఉండటంతో ఆలయ అధికారులు ఎవరూ ప్రశ్నించే సాహసం చేయనట్లు తెలుస్తోంది. శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో రోజూ పదివేలకు పైగా లడ్డూలను తయారుచేస్తారు. ఈ తయారీకి ఎక్కువ మోతాదులోనే నెయ్యి, జీడిపప్పు ఉపయోగిస్తారు. దీనిని ఆసరగా చేసుకుని కొందరు వైసీపీ నేతలు మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రసాదాల తయారీలో ఉపయోగించే వస్తువుల నమూనాలు ప్రదర్శించాల్సి ఉన్నా కాంట్రాక్టర్ ఆ నిబంధనలు పాటించనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం: మంత్రి లోకేశ్



విజయవాడ: ఏపీ రాష్ట్రాభివృద్ధికి భారత పరిశ్రమల సమాఖ్యతో కలిసి పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఇప్పుడు ఏపీ దృష్టి పెట్టిందని చెప్పారు. వేగంగా అనుమతులు, యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని వెల్లడించారు. విజయవాడలో సీఐఐ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. నెల రోజుల్లో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తాం. పెట్టుబడుల కోసం మీ వద్దకే మేం వస్తాం. నైపుణ్యం ఉన్న మానవ వనరులు కూడా ఏపీలో సిద్ధం" అని లోకేశ్ అన్నారు.

**పరిశ్రమల ఏర్పాటుకు ఎకో సిస్టం..** పరిశ్రమల ఏర్పాటుకు శాశ్వతంగా ఒక ఎకో సిస్టం ఉండాలని, అప్పుడే పెట్టుబడులు సుస్థిరంగా వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీ, ఐటీ కారిడార్లు గతంలో ఏర్పాటు అయ్యాయని, వాటికి రాజకీయాలు, ప్రభుత్వాలతో సంబంధం ఉండదని తెలిపారు.
ఏపీలో ఏర్పాటైన కియా లాంటి పరిశ్రమలు కూడా అలాంటివేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంప్రదాయేతర విద్యుత్ పీపీఏలు రద్దు కావడం.. ఏపీకే కాదు యావత్ భారత దేశంపైనా ప్రభావం చూపిందని విమర్శించారు. పెట్టుబడులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసేందుకు తమ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోందన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఏపీలో అగ్రి బయోటెక్ క్లస్టర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర యెల్లా సూచించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేశ్ అనంతపురంలో దీని ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.


# గోదావరి నదిలో భారీగా గ్యాస్ లీక్.. భయాందోళనలో స్థానికులు..

కోనసీమ జిల్లా: గోదావరి నది నుంచి గ్యాస్ లీక్ కావడం కలకలం రేపుతోంది. యానాం దర్యాలతిప్ప, కాట్రేనికోన మండలం బలుసుతిప్ప మధ్య గోదావరిలో ఓఎన్జీసీ సంస్థ గ్యాస్ పైప్ లైన్ వేసింది. అయితే రాత్రి నుంచీ గ్యాస్ లీక్ కావడం ఇంతవరకూ అధికారులు దాన్ని గుర్తించకపోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నీటిని చీల్చుకుంటూ గ్యాస్ పైకి తంతుండడంతో మంటలు వ్యాప్తించే ప్రమాదం ఉందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీగా లీకేజీ కావడంతో నీళ్లు సుడులు తిరుగుతున్న దృశ్యాలు కలకలం రేపుతున్నాయి. గ్యాస్ లీక్ కావడంతో భరించలేని వాసన వస్తోంది. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇప్పటివరకూ యాజమాన్య సంస్థ స్పందిచకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓఎన్జీసీ సంస్థ తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని మండిపడుతున్నారు. అయితే ముందుగా గ్యాస్ లీకవుతున్న ఘటన మత్స్యకారులు ద్వారా తెలుసుకున్న యానాం కాంగ్రెస్ పార్టీ నాయకుడు దినేశ్ సాహసించి సంఘటనా స్థలానికి బోటుపై వెళ్లారు. దీనికి సంబంధించిన దృశ్యాలను ఆయన చిత్రీకరించి గ్యాస్ లీక్ ఆపాలంటూ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. అయితే ఈ వీడియోలు కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వీటిని చూసిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇలాంటి గ్యాస్ లీక్ ఘటనల వల్ల మంటలు చెలరేగి గతంలో ప్రమాదాలు జరిగాయి. అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గ్యాస్ లీకేజీని అరికట్టి భారీ నష్టం జరగకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




# గండ్ల పూడికతీత పనులు నాణ్యంగా చేపట్టాలి : మంత్రి నిమ్మల

అమరావతి : ఏపీలో అకాల వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న కాలువలు, డ్రైనేజీలు, చెరువులకు పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇరిగేషన్ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావులతో కలిసి తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు రాష్ట్రంలోని జలవనరుల శాఖ సీఈ, ఎస్ఈ, ఈఈలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద నష్టం, గండ్లు పూడిక పనులపై జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈ, ఈఈలతో అత్యవసర సమావేశంలో చర్చించారు. గట్లకు ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో గుర్తించి వాటిని వెంటనే పూడ్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. క్షేత్రసాయిలో పర్యటించి గుర్తించిన గండ్లకు కలెక్టర్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆఖరి ఎకరం వరకూ రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందిరాకుండా చూడాలన్నారు. గోదావరి డెల్టా సిస్టమ్‌లో ప్రధానంగా ఏలేరు, అమ్మిలేరు, ఎర్ర కాలువ, బుడమేరు, కొల్లేరుకు సంబంధించి గండ్లతోపాటు ఆక్రమణలనూ గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



## పొలంలో రకుల్ చిల్లింగ్ మూడ్

రకుల్ ప్రీత్ సింగ్ ఈ మధ్య కాలంలో సినిమాల్లో కంటే ఎక్కువ సోషల్ మీడియాలో కనిపిస్తుంది. ఒకానొక సమయంలో టాలీవుడ్ లో మోస్ట్ బిజీ హీరోయిన్ గా సినిమాలు చేసిన ఈ అమ్మడు కోలీవుడ్, బాలీవుడ్ లోనూ సినిమాలు చేసిన విషయం తెల్సిందే. తెలుగు లో సినిమా ఆఫర్లు తగ్గిన సమయంలో బాలీవుడ్, కోలీవుడ్ లో ఆఫర్లు వచ్చినా పెద్దగా అక్కడ వర్కౌట్ అవ్వలేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. దాంతో రకుల్ ప్రీత్ సింగ్ ఏ భాషలోనూ సినిమా ఆఫర్లు లేక పోవడంతో సోషల్ మీడియాలో తన అందాల ఫోటో షూట్స్ ను షేర్ చేస్తూ మళ్లీ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తోంది. రకుల్ ప్రీత్ సింగ్ తెలుగు లో కెరటం సినిమాతో 2011 లో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ విజయాన్ని సొంతం చేసుకోవడంతో వరుసగా టాలీవుడ్ లో సినిమా ఆఫర్లు దక్కించుకుంది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా రకుల్ సినిమాలు చేసింది. కానీ నాలుగు అయిదు



సంవత్సరాల్లోనే రకుల్ క్రేజ్ తగ్గింది. తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసిన రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో మాత్రం అప్పుడు ఇప్పుడూ తన అందాల ఆరబోత ఫోటోలతో సందడి చేస్తూనే ఉంది. నెట్టింట మరోసారి రకుల్ తన అందాల ఫోటోలతో రచ్చ చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ లో దాదాపుగా 24 మిలియన్ ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న రకుల్ ప్రీత్ సింగ్ రెగ్యులర్ గా తన ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. రకుల్ ఏ ఫోటోను షేర్ చేసినా లక్షల్లో లైక్స్, వేలల్లో కామెంట్స్ వస్తూ ఉంటాయి. ప్రతి ఫోటో వైరల్ అవ్వడం జరుగుతుంది. తాజాగా ఒక షూట్ ను ముగించుకుని పొలంలో ఇలా సరదాగా టైం స్పెండ్ చేసిన ఫోటోలను షేర్ చేసింది. అందాల రకుల్ ప్రీత్ సింగ్ అంతకు మించిన అందమైన ప్రకృతిలో చిల్ అవ్వడంను ఈ ఫోటోలో చూడవచ్చు. రకుల్ ప్రీత్ సింగ్ అందమైన ఈ ఫోటోలకు నెట్టింట పెద్ద ఎత్తున లైక్స్, కామెంట్స్ వస్తున్నాయి. బాలీవుడ్ లో రకుల్ ప్రీత్ సింగ్ నటించిన దే దే ప్యార్ దే సినిమా కు మంచి స్పందన వచ్చింది. దాంతో బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయని అంతా భావించారు. కానీ అక్కడ ఆ తర్వాత వరుసగా ఆఫర్లు రాలేదు. నెట్టింట మాత్రం రకుల్ కి బాలీవుడ్ హీరోయిన్స్ స్థాయిలో క్రేజ్ దక్కింది. ఆ సినిమాలో అందాల ఆరబోత చేసినా పెద్దగా ప్రయోజనం దక్కలేదు. ప్రతి ఫోటో లోనూ కొత్తదనం చూపిస్తూ తన ఫాలోవర్స్ కి కన్నుల విందు చేసే రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి ఆకట్టుకుంది. అందమైన రకుల్ ప్రీత్ సింగ్ ఫోటోలు మరోసారి వైరల్ అవుతున్నాయి.

## క్వీన్ పెళ్లికి రెడీ అంటోంది.. అప్లికేషన్ పెట్టుకుంటారా?

వివాదాలతో నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకొస్తోంది క్వీన్ కంగన. భాజపా తరపున పోటీ చేసి ఎంపీ అయ్యాక మరింతగా చెలరేగి కామెంట్లు చేస్తోంది. రాజకీయాలు తనకు చాలా ఇబ్బందులు క్రియేట్ చేస్తున్నా దేనికీ తలవొంచడం లేదు. కంగన నటించి స్వీయదర్శకత్వంలో తెరకెక్కించిన ఎమర్జెన్సీని రిలీజ్ కానివ్వకుండా కొన్ని సిక్కు గ్రూపులు అడ్డుకట్ట వేస్తున్న సంగతి తెలిసిందే. అదే క్రమంలో అప్పులు తీర్చుందుకు ముంబైలోని తన ఆఫీస్ కార్యాలయాన్ని కంగన అమ్ముకోవాల్సి వచ్చిందని మీడియాలో కథనాలొచ్చాయి. అదంతా అటుంచితే పరిస్థితులు ఎలా ఉన్నా కానీ కంగన తాను చేయాల్సినది చేస్తూ పోతోంది. తాజాగా కంగనా రనౌత్ తన వివాహ ప్రణాళిక గురించి వెల్లడించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుండి



పార్లమెంటు సభ్యురాలు అయ్యాక తన ఆలోచన మారినట్టే కనిపిస్తోంది. తాను కూడా పెళ్లాడి ఒక కుటుంబాన్ని ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నానని క్వీన్ తాజా చాటింగ్ సెషన్‌లో తెలిపింది. నేను ఖచ్చితంగా పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను అని న్యూస్ 18 షోషాలో కనిపించిన సందర్భంగా చెప్పింది. అయితే ప్రస్తుత %పీూ% టర్మ్ సమయంలో వివాహం జరుగుతుందా? అని ప్రశ్నించగా కంగనా బదులిస్తూ .. ప్రస్తుత గడువు ముగిసిన తర్వాత పెళ్లి చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని భావిస్తున్నాను అని అంది. పెళ్లి చేసుకోవాలనుందని కంగనా రనౌత్ బహిరంగంగా చెప్పడం ఇదే తొలిసారి కాదు. అంతకుముందు రాజ్ షమణితో పోడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ.. జీవితంలో తోడు ఉండాల్సిన ప్రాముఖ్యత గురించి కంగనా మాట్లాడింది. తోడు లేకుండా ఉండటం కష్టం. ఒకరుగా ఉండటం అంత సులభం కాదు. ప్రతి ఒక్కరికి తోడు ఉండాలి. సహచరుడు లేకుండా చాలా కష్టం అని వ్యాఖ్యానించింది. కంగనా రనౌత్ చివరిసారిగా 2023 చిత్రం తేజస్‌లో కనిపించింది. సర్వేష్ మేవర దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫ్లాపైంది. త్వరలో ఎమర్జెన్సీ విడుదల కానుంది.




## 1992 యానిమే 'రామాయణం' మ్యాజిక్ రీక్రియేట్ చేస్తుందా?



4కే వెర్షన్లలో రీరిలీజ్ చేయడం ఇటీవలి ట్రెండ్. అగ్ర హీరోల బ్లాక్ బస్టర్ సినిమాలను రీమాస్టర్ చేసి కొత్త వెర్షన్లను రీరిలీజ్ చేస్తూ నిర్మాతలు మళ్లీ ఆర్జిస్తున్నారు. అయితే ఇప్పుడు ఇదే ట్రెండ్ ని ఫాలో అవుతూ 1992లో విడుదలైన రామాయణం యానిమేషన్ మూవీని 4కేలో రీమాస్టర్ చేసి తిరిగి రిలీజ్ చేస్తున్నారు. రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఇష్టపడే యానిమేషన్ చిత్రం. హిందీ, ఇంగ్లీష్, తమిళం, తెలుగు భాషలలో అక్టోబర్ 18న భారతీయ థియేటర్లలో ప్రదర్శితమవుతుంది. 1992లో విడుదలైన ఈ మూవీని అప్పట్లో జపనీస్ నిర్మాత యుగో సాకో – భారతీయ నిర్మాత రామ్ మోహన్ సంయుక్తంగా నిర్మించారు. ఇప్పుడు దీనిని రీమాస్టర్ చేసి ఫర్హాన్ అక్తర్ – రితేష్ సిధ్వానిల ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్, ట్రైలర్‌ను గీక్ పిక్చర్స్ ఇండియా విడుదల చేసింది. అభిమానులను ఉర్రూతలూగించిన ఒక కథ ప్రతి హృదయంలో ఎప్పటికీ సజీవంగా ఉంది. రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ అక్టోబర్ 18న భారతదేశం అంతటా విడుదలవుతోందని వారు టీజర్‌కు క్యాప్షన్ ఇచ్చారు. గీక్ పిక్చర్స్ ఇండియా సహ వ్యవస్థాపకుడు అర్జున్ అగర్వాల్ మాట్లాడుతూ– ఈ రామాయణం అన్ని రకాల కొత్త రికార్డులను బద్దలు కొట్టబోతోంది.. ఎందుకంటే ఇండో–జపాన్ సహకారం కోసం ఇక్కడ కొత్త శకం ప్రారంభమవుతుంది. ఇది డైనమిక్ ఆలోచన. చాలా స్పష్టమైన రంగురంగుల చిత్రణతో రామాయణం అందరినీ అలరిస్తుంది. రామ్ కథ అన్ని వయసుల వారికోసం .. అని తెలిపారు. దసరా – దీపావళి సెలవులలో విడుదలవుతున్నందున రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ సినిమా ప్రేక్షకులను కచ్చితంగా ఆకర్షిస్తుంది. రామాయణం అభిమానులైనా లేదా యానిమేషన్ చిత్రాలను ఇష్టపడేవారైనా థియేటర్లకు తప్పక విచ్చేస్తారు.. అని తమ గణాంకాలను కూడా చెప్పారు నిర్మాతలు. ఒక ముఖ్యమైన హిందూ ఇతిహాసం విష్ణువు ఏడవ అవతారం అయిన రాముడి కథను చెబుతుంది. రాకుమారుడైన రాముడి జీవితాన్ని తెరపరిచింది.

ఈ యానిమేషన్ వెర్షన్‌లో యుగయుగాలకు సంబంధించిన మంత్రముగ్ధత వెండితెరపై జీవం పోసుకుంది. రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ లో రాముని వనవాసం, సీత అపహరణ, హనుమంతుని అంకితభావం, రావణుడు – శ్రీరాముడి మధ్య చివరి ఘర్షణ సహా రామాయణంలోని కీలక సన్నివేశాలతో అలరిస్తుంది. పవిత్రమైన హిందూ పురాణంపై తీసిన రామాయణం మొదటి యానిమేటెడ్ సినిమా కూడా. ఈ సినిమా సజీవ యానిమేషన్, సంగీత కూర్పు, ఇతిహాసాన్ని మరో లెవల్ లో ఆవిష్కరించిందని నిపుణులు చెబుతున్నారు.

## 'దేవర'కు అక్కడ ప్రముఖ హీరో అండదండలు



యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా చిత్రం 'దేవర' సెప్టెంబర్ 27న థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది. ఉత్తరాది, దక్షిణాది రెండు చోట్లా అత్యంత భారీగా విడుదల కానున్న ఈ సినిమా ఓవర్సీస్ లోను ప్రతిష్ఠాత్మకంగా విడుదలవుతోంది. అయితే తెలుగు సినిమాల వసూళ్లు ఇరుగు పొరుగు భాషల్లో డబుల్ డిజిట్ తేవడం చాలా కష్టంగా ఉంటోంది. అన్ని సినిమాలు ఆర్.ఆర్.ఆర్ – కేజీఎఫ్ తరహా మ్యాజిక్ ని చేయలేవు.

కానీ ఇప్పుడు దేవర మాత్రం అసాధారణ క్రేజ్ తో ఆశల్ని పెంచుతోంది. తాజా సమాచారం మేరకు.. దేవర కేరళ డిస్ట్రిబ్యూషన్ హక్కులను దుల్కర్ సల్మాన్ కి చెందిన వేఫేరర్ ఫిలింస్ ఛేజిక్కించుకుందని తెలిసింది. పేరున్న సంస్థ గనుక కేరళలోను భారీ ఓపెనింగ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. మాలీవుడ్ లో క్రేజ్ ఉన్న హీరో ప్రమోషన్స్ కారణంగా అక్కడా భారీ ఓపెనింగులు తెస్తుందనే అంచనాలేర్పడుతున్నాయి. దేవర చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహించారు. సైఫ్ అలీ ఖాన్, జాన్వీ కపూర్ సహా భారీతారాగణం ఇందులో నటించారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ స్వరాలు అందించగా, వాటికి అద్భుత స్పందన వచ్చింది. ముఖ్యంగా పాటల్లో ఎన్టీఆర్ తో జాన్వీ రొమాన్స్ ఒక రేంజులో వర్కవుటైందన్న ప్రశంసలు కురుస్తున్నాయి. ట్రైలర్ కి మాస్ లో మంచి స్పందన వచ్చింది. పాటలకు అన్ని వర్గాల్లో గుర్తింపు దక్కింది. గనుక ఇవన్నీ దేవరకు ప్లస్ కానున్నాయని అంచనా వేస్తున్నారు. మరో రోజుల్లో దేవరలో మ్యాటర్ ఎంత? అన్నది తేలిపోనుంది.

## నచ్చితే మెచ్చుతా...పోటీ మాత్రం పడను!

ఇండస్ట్రీలో హీరోయిన్ల మధ్య పోటీ ఉంటుందంటారంతా. ఒకరికి రావాల్సిన అవకాశం మరొకరికి వెళ్లినా? అని వార్య కారణాలతో ప్రాజెక్ట్ నుంచి ముందు ఎంపిక చేసిన భామని తప్పించినా? అందుకు పోటీ కారణంగా హైలైట్ అవుతుంటుంది. ఫాంలో ఉన్న భామల మధ్య ఈ పోటీ ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఈ పోటీ విషయాన్ని హీరోయిన్ల దృష్టికి తీసుకెళ్తే ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పందిస్తుంటారు. తాజాగా ఈ విషయంపై శ్రీలీల కూడా తన అభిప్రాయాన్ని పంచుకుంది. 'చిత్ర పరిశ్రమ అన్నది ఓ పుష్పక విమానం. ప్రతీ నటికి వాళ్ల ప్రతిభకు తగ్గట్లుగా తమకంటూ ఓ స్థానం ఉంటుంది. అందుకే ఇక్కడ పోటీ ఉంటుందని నేనెప్పుడు భావించను. ప్రతీ సినిమా విషయంలో నా నటనకు మెరుగు పరుచుకుంటూ



ముందుకెళ్తా. తోటి నాయికల ఎవరి నటన అయినా మెచ్చుకోవడం నాకున్న గొప్ప అలవాటు. వాళ్లతో పోటీ పడుతున్నాని ఎప్పుడూ అనుకోను. ఒక అవకాశం చేజారినా అందులో మరో నాయిక నటించినా? నేను నటించాల్సిన సినిమా అనే భావన రానివ్వను. నా మనసు...మైండ్ ఎప్పుడూ ఫ్రెష్ గా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. నేను ఎవర్నీ పోటీగా భావించను. నేను ఎవరికీ పోటీ కాను అన్నదే నా సిద్దాంతం' అంది. ప్రస్తుతం శ్రీలీల నటిగా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. పవన్ కళ్యాణ్ నటిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' లో నటిస్తోంది. అలాగే నితిన్ కిజోడీగా 'రాబిన్ హుడ్' లో నటిస్తోంది. ఈ రెండు గాక మాస్ రాజా రవితేజతో ఓ సినిమాకి ఎంపికైంది. ఇది రవితేజ ల్యాండ్ మార్క్ చిత్రం. ఆ సినిమా నెంబర్ 75.

## కాలేజ్ వయసులోనే మహేష్‌తో పరిచయం

మహేష్ బాబు- త్రిష జంటగా నటించిన అతడు అభిమానులకు ఆల్ టైమ్ ఫేవరెట్ మూవీ. కామెడీ, మ్యూజిక్, రొమాన్స్, యాక్షన్ అన్నీ సమపాళ్లలో కుదిరిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించకపోయినా కానీ, బుల్లితెరపై బంపర్ టీఆర్పీలతో ఎప్పుడూ ఆకట్టుకుంటూనే ఉంటుంది. ఈ సినిమాలో త్రిష పల్లెటూరి అల్లరి అమ్మాయిగా నటించింది. అలాగే మహేష్ తో సైనికుడు చిత్రంలోను ఆడిపాడింది. కానీ ఆ తర్వాత మరో సినిమా కలిసి చేయలేదు. ఆన్ స్క్రీన్ త్రిషతో మహేష్ రొమాన్స్ ఒక రేంజులో వర్కవుటైనా కానీ, ఎందుకనో మళ్లీ కలవలేదు వీళ్లు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబుపై త్రిష ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మహేష్ గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని హోస్ట్ ప్రశ్నించగా, అతడు ఇష్టమైన నటులలో ఒకరు అని తెలిపింది. అంత పెద్ద సూపర్‌స్టార్ అయినప్పటికీ అతను చాలా గౌరవంగా ఉంటాడు. చాలా సౌకర్యంగా అనిపిస్తుంది. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే.. మహేష్ బాబు నటనలోకి రాక ముందునుంచే నాకు



తెలుసు. కాలేజీ రోజుల్లో మహేష్ బాబు చెన్నైలో ఉండేవాడని పరస్పర స్నేహితుల ద్వారా ఆమెకు మహేష్ పరిచయం ఏర్పడిందని వెల్లడించింది. అప్పటికి నటులు అవుతారని వారికి తెలియదట. షూటింగ్ కోసం మహేష్ చాలా కష్టపడతాడు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు షూటింగ్‌లో పాల్గొంటాడు. అతని కష్టానికి గిల్టీగా అనిపించింది. కారవాన్ లోకి కూడా వెళ్లడు. తాను, కమెడియన్లు, ఎవరైనా నటించిన ప్రతి సన్నివేశాన్ని మహేష్ మానిటర్ ముందు కూర్చుని గమనిస్తాడని త్రిష చెప్పింది. త్రిష ఇటీవల టాలీవుడ్ సినిమాకి సంతకం చేసింది. తెలుగులో విశ్వంబర చిత్రంలో చిరంజీవి సరసన నటిస్తోంది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో సాగే చిత్రమిది. దాదాపు 17 ఏళ్ల తర్వాత త్రిష–చిరంజీవి కలిసి నటిస్తున్నారు. వీరిద్దరూ గతంలో స్టాలిన్ చిత్రంలో కలిసి నటించారు. విశ్వంభర 10 జనవరి 2025న విడుదల కానుంది. దీనిని పాన్ ఇండియా చిత్రంగా పలు భాషల్లో విడుదల చేయనున్నారు. మహేష్- రాజమౌళి సినిమా కూడా పట్టాలెక్కేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో చిత్రీకరణకు ప్లాన్ చేస్తున్నారు. తొలి దశ షూటింగ్ జర్మనీలో ప్రారంభం కానుందని సమాచారం. కథ ఎక్కువగా అడవిలో సాగుతుందని ఫారెస్ట్ అడ్వెంచర్ అని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో అరుదైన గిరిజన జాతికి సంబంధించిన ప్రస్తావనలు ఉంటాయని, దీని కోసం టీమ్ స్కెచ్ వేస్తోందని, త్వరలోనే కాస్ట్యూమ్స్ ఖరారు చేస్తారని కూడా తెలుస్తోంది. ఇప్పటికే వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులు షూట్ ప్రారంభానికి ముందే తమ లుక్‌ను ఖరారు చేసేందుకు లుక్ టెస్టుల్లో పాల్గొంటున్నారని, నటన పరంగా శిక్షణ పొందుతున్నారని సమాచారం.

# సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు సీఎల్పీ మీటింగ్.. ఆ అంశంపైనే కీలక చర్చ!



హైదరాబాద్ : స్థానిక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తున్న వేళ కాంగ్రెస్ గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రేపు కాంగ్రెస్ శాసన సభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు ఏఐసీసీ నుంచి వచ్చిన బాధ్యులు విశ్వనాథ్, విష్ణునాథ్, కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతోన్న సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించనున్నట్లుగా తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బూత్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన విధి విధానాలపై వారు చర్చించనున్నారు. ఇక మండల స్థాయి నుంచి కొత్త కమిటీలను నియమించడం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లడం, వివిధ స్థాయిల్లో పార్టీ ముఖ్య నాయకుల మధ్య సమన్వయం నెలకొల్పే విషయాలు చర్చకు రానున్నాయి. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కొత్త కమిటీ ఏర్పాటు, పార్టీ బాధ్యతతో పాటు అభ్యర్థితం ఖరారుపై ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బాధ్యతలను అప్పగించనున్నట్లుగా తెలుస్తోంది.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గెలిచేలా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించే విషయం సమావేశంలో చర్చించనున్నట్లుగా సమాచారం.

# పెట్టుబడులే లక్ష్యంగా.. డిప్యూటీ సీఎం భట్టి విదేశీ పర్యటన



హైదరాబాద్ : తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం అమెరికా, జపాన్ దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లింది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఆధునిక పద్ధతులు, లోతైన అధ్యయనంతోపాటు పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం ఈ రోజు హైదరాబాద్ నుంచి అమెరికాకు బయలుదేరింది. ఈనెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు పర్యటన కొనసాగనుంది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎక్స్-పోతోపాటు, ప్రముఖ కంపెనీల ప్రధాన కార్యాలయాల సందర్శన, పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం సమావేశం కానున్నారు. ఈనెల 24,25 తేదీల్లో అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొంటారు. అక్కడ వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. ఈనెల 26న లాస్ ఏంజెల్స్‌కు చేరుకుంటారు. ఈనెల 27న ఎడ్ వార్డ్స్, సన్ బోర్న్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ విధానాన్ని పరిశీలిస్తారు. ఈనెల 28వ తేదీన పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో సమావేశమవుతారు. ఈ నెల 29న టోక్యోకి చేరుకుంటారు. ఈనెల 30న స్థానిక పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారు. అక్టోబర్ 1న పెట్టుబడిదారులతో వ్యక్తిగతంగా (వన్ టు వన్) సమావేశమవుతారు. యామాన్షి గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును సందర్శిస్తారు. అక్టోబర్ 2న తోషిబా, కవాసాకి, అక్టోబర్ 3న పానసోనిక్ ప్రధాన కార్యాలయాలను సందర్శిస్తారు, అక్టోబర్ 4న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ తదితరులు వెళ్లారు.

# సీఎం రేవంత్ భారీ కుంభకోణం.. కేటీఆర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ స్కాం రూ. 8,888 కోట్లు ఉంటుందని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై విచారణ జరిపిస్తే రేవంత్ రెడ్డి సీఎం పదవి పోతుందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డి కంపెనీకి అర్హతలు లేకున్నా వేలకోట్ల రూపాయలు పనులను కట్టబెట్టారని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి.. ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. "పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్ రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారు. ఇందులో టెండర్ దక్కించుకున్న సదరు కంపెనీతో రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీ జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకు తెరలేపారు. 1137 కోట్ల రూపాయల కాంట్రాక్టు గెలుచుకున్న తర్వాత ఆ కంపెనీ 20 శాతం పనిచేస్తోంది. ముఖ్యమంత్రి బావమరిది మాత్రం 80% పని అంటే రూ. 1000 కోట్ల పని చేస్తోంది. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇంత పెద్ద భారీ కుంభకోణానికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారు. తాను బీఆర్ఎస్ ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహించిన పురపాలక శాఖ కేంద్రంగా రేవంత్ రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్ రెడ్డి పదవీ కోల్పోయి అవకాశం ఉంది" అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

# ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోంది



హైదరాబాద్: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పీఏసీ చైర్మన్ కోసం నామినేషన్ వేయలేదని.. ఆయనను ఎలా చైర్మన్‌గా నియమిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రశ్నించారు. హరీష్ రావును ఎందుకు లిస్ట్‌లో లేకుండా చేశారని నిలదీశారు. హరీష్ రావు అంటే అధికార పార్టీకి భయమా అని అడిగారు. ఇవాళ అసెంబ్లీ మీడియా పాయింట్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యే లు, ముగ్గురు ఎమ్మెల్సీల పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని గుర్తుచేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చాలా కీలకమని చెప్పారు. తాము అన్ని గమనిస్తామన్నారు. ఈ విషయంపై తెలంగాణ హై కోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్‌ను కలుద్దామని చూస్తే ఆయన వెళ్లిపోయారని అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలకు కూడా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రొటోకాల్ పాటించడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శలు చేశారు. కల్యాణ లక్ష్మి చెక్కులు కూడా కాంగ్రెస్ నేతలే పంచుతున్నారని.. గెలిచిన ఎమ్మెల్యేలు ఏం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ - బలహీన వర్గాల కోసం తపించిన వ్యక్తి




హైదరాబాద్ : తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు.

ఎమ్మెల్యేగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు నిరంతరం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారన్నారు. కాగా, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఈ నెల 27న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

# పీఏసీ నియామకంలో కూడా రాజకీయాలా..

హైదరాబాద్: ప్రతిపక్ష పార్టీలకు దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. పీఏసీ సమావేశానికి వచ్చాం.. కానీ మీటింగ్ ప్రారంభంలోనే పీఏసీ నియామకంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అడిగామని తెలిపారు. కమిటీని ఎన్నుకున్నారా.. సెలక్షన్ చేశారా అని అడిగామన్నారు. ఇవాళ( శనివారం) అసెంబ్లీ మీడియా పాయింట్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి , గంగుల కమలాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ...రూల్ 250 ప్రకారం పీఏసీ కమిటీని ఎన్నుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం కోరామని అన్నారు. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పేర్లు, మండలి నుంచి ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని చెప్పారు. కానీ హరీష్‌రావు పేరు లేకుండా అరికపూడి గాంధీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్‌ను ప్రతిపక్ష పార్టీ నియమిస్తుందని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చినట్లు గుర్తుచేశారు. గతంలో కూడా ప్రతిపక్ష పార్టీలోఉన్న నేతలే పీఏసీ చైర్మన్లు అయ్యారని వివరించారు. కేంద్రంలో కూడా ఇదే ఫార్ములా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ చైర్మన్‌గా చేశారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకే లోక్‌సభలో కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్ అయ్యారని గుర్తుచేశారు. పీఏసీ నియామకంపై స్పీకర్‌ను అడిగితే ఆయన ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్నింటికి మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఎలా చెబుతారని నిలదీశారు.




# గ్రీన్ కార్డుదారులకు అమెరికా గుడ్‌న్యూస్.. వ్యాలిడిటీ పెంపు

అమెరికాలో శాశ్వత నివాసం పొందుతున్న గ్రీన్‌కార్డుదారులకు అక్కడి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ పర్మనెంట్ రెసిడెంట్ కార్డుల వ్యాలిడిటీ కాలాన్ని మరింత పొడిగించింది. గతంలో గ్రీన్‌కార్డు గడువు తీరినప్పటికీ .. మరో 24 నెలల పాటు దాని వ్యాలిడిటీ పొడిగించేవారు. ఇప్పుడు దీన్ని 36 నెలలకు పెంచినట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ వెల్లడించింది. దీంతో గ్రీన్‌కార్డు రెన్యువల్ కోసం ప్రయత్నిస్తున్న వారికి ఊరట లభించినట్లైంది. సాధారణంగా అమెరికాలో గ్రీన్‌కార్డులు పొందినవారు ప్రతీ పదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డు గడువు తీరిపోయే కాలానికి ఆరు నెలల ముందే ఐ-90 ఫామ్‌ను సమర్పించాలి. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కార్డు వ్యాలిడిటీని 24 నెలలు పొడిగిస్తూ రిసీట్ నోటీసు ఇస్తారు. దీంతో గ్రీన్‌కార్డు గడువు తీరిపోయినా.. ఈ నోటీసుతో వారికి చట్టబద్ధమైన నివాస హోదా కొనసాగుతుంది. కొత్త కార్డు జారీ అయ్యే వరకు ఉద్యోగాలు, ప్రయాణాల సమయంలో వారు దాన్ని లీగల్ స్టేటస్ ప్రూఫ్‌గా వినియోగించుకోవచ్చు. తాజాగా ఈ గ్రీన్‌కార్డు అదనపు వ్యాలిడిటీని 36 నెలలకు పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్త కార్డుల కోసం వేచిచూసే వారు మరింతకాలం చట్టబద్ధంగా శాశ్వత నివాస హోదాను కొనసాగించేందుకు వీలు లభించినట్లవుతుంది. అయితే, కండిషనల్ రెసిడెన్సీ తీసుకునేవారి గ్రీన్‌కార్డుల గడువు రెండేళ్లపాటే ఉంటుంది. వీరికి తాజా పొడిగింపు వర్తించదు. వీరు ముందుగా నివాస హోదాపై ఉన్న కండీషన్స్ తొలగించుకునేందుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కార్డు గడువు తీరే 90 రోజుల్లోపు దీన్ని చేసుకోవాలి. దరఖాస్తు అనుమతి పొందితే.. వారికి 10ఏళ్ల కాలానికి గ్రీన్‌కార్డు లభిస్తుంది.

# ప్రతీ భక్తుడిని బాధపెడుతోంది.. క్షుణ్ణంగా పరిశీలించాలి



న్యూఢిల్లీ : తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం కల్తీపై రాష్ట్రంలోనే దేశ వ్యాప్తంగా కూడా తీవ్ర కలకలం రేపుతోంది. లడ్డు తయారీకి కల్తీ నెయ్యి వాడకంపై ప్రతీఒక్కరూ తప్పుబడుతున్న పరిస్థితి. ఈ వివాదంపై హిందువులు, హిందూ సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. వైసీపీ హయాంలో జరిగిన ఈ అపచారంపై రాజకీయ నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తాజాగా తిరుపతి లడ్డు కల్తీ నెయ్యిపై వస్తున్న ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ శ్రీనివాసుడు భారతదేశమే కాకుండా దేశవ్యాప్తంగా అనేక మంది భక్తులకు పవిత్ర దేవుడని అన్నారు.

మతపరమైన ప్రదేశాల పవిత్రతను అధికారులు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వార్త దేశవ్యాప్తంగా తీవ్రంగా కలకలం రేపుతోందని రాహుల్ పేర్కొన్నారు.

**రాహుల్ ట్వీట్ ఇదే..** "తిరుపతిలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. లార్డ్ బాలాజీ భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల భక్తులకు పవిత్రమైన దేవుడు. ఈ సమస్య ప్రతి భక్తుడిని బాధపెడుతుంది,

దీన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అధికారులు మతపరమైన ప్రదేశాల పవిత్రతను కాపాడాలి" అంటూ ఎక్స్(ట్విట్టర్)లో రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.




# జానీ మాస్టర్ కేసులో మరో ట్విస్ట్..

హైదరాబాద్: మహిళా కొరియోగ్రాఫర్‌పై జానీ మాస్టర్ అత్యాచారం కేసులో మరో ట్విస్ట్ నెలకొంది. యువతిపై దాడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో జానీ మాస్టర్ భార్య అయేషాపైనా చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే యువతిపై అత్యాచారం కేసులో జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్టు చేసిన పోలీసులు.. చంచల్ గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో కేసు మరో కీలక మలుపు తిరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తనపై అత్యాచారం చేశారని, ఆయన భార్య అయేషా తనపై దాడి చేసిందని జానీ మాస్టర్ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ నార్సింగి పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే ఆయన భార్య అయేషా తన ఇంటికి వచ్చి దాడి చేసినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఈ కేసులో ఆమెను నిందితురాలుగా చేర్చాలని పోలీసులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. జానీ భార్యతోపాటు మరో ఇద్దరినీ నిందితులుగా చేర్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఇవాళ ఉప్పరపల్లి కోర్టులో జానీ మాస్టర్‌ని కస్టడీకి కోరుతూ నార్సింగి పోలీసులు పిటిషన్ వేయనున్నారు. పది రోజులపాటు కస్టడీకి కోరే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో ఆయన్ను విచారించేందుకు పోలీసులు కోర్టుకు వెళ్లనున్నారు. రిమాండ్ రిపోర్టులోని కీలక అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. లేడీ కొరియోగ్రాఫర్ ఇచ్చిన 40పేజీల ఫిర్యాదుపైనా సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు కస్టడీ కోరనున్నారు. అలాగే ఆయన భార్యపై కూడా ఆరోపణలు రావడంతో అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు జానీ మాస్టర్‌పై ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు కావడంతో ఆయన తరపు న్యాయవాది బెయిల్ కోసం రంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించనున్నారు.

# ఏచూరీ సంస్మరణ సభలో కేటీఆర్ హాట్ కామెంట్స్..

హైదరాబాద్, సెప్టెంబర్ 21: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. సీతారాం ఏచూరి గొప్పదనాన్ని కీర్తించారు. ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డలుగా ఏచూరీతో మాబంధం రక్త సంబంధం అని అన్నారు. నమ్మిన సిద్ధాంత కోసం ఆఖరి వరకు పోరాడిన ఏచూరీ జీవితం తమ లాంటి వారికి ఆదర్శం అని పేర్కొన్నారు. ఎప్పుడు కండువా మార్చుతారో తెలియని కాలంలో సీతారాం ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. ఫిరాయింపుల కాలంలో పదవుల కోసం కాకుండా.. సిద్ధాంతం కోసం పని చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కీర్తించారు. తిట్లు, బూతులు చలామణి అవుతోన్న ప్రస్తుత రాజకీయాల్లో ఏచూరీ రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. అసలుసిసలైన హైదరాబాద్ బిడ్డ సీతారాం ఏచూరీ అని పేర్కొన్నారు. ఓట్ల రాజకీయంలో వెనుకబడినా.. తాము ప్రజల కోసం పోరాటంలో ముందున్నామని చాటిచెప్పిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కేటీఆర్ అన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న కుటుంబంలో పుట్టినప్పటకీ.. ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి ఏచూరీ అని.. ఇందిరా గాంధీని రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఏకైక వ్యక్తి అన్నారు. దీన్ని బట్టే సీతారం ఏచూరీ గుండె ధైర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రశ్నించటమే ప్రజాస్వామ్యం అని నమ్మిన వ్యక్తి ఏచూరీ అని కీర్తించారు. రవీంద్ర భారతిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభ జరిగింది. ఈ సంస్మరణ సభకు కేటీఆర్, కోదండరాం, తమ్మినేని వీరభద్రం, బీవీ రాఘవులు, మోహన్ కందా, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికాసేపట్లో ఈ సమావేశానికి హాజరవనుండగా.. కేటీఆర్ తన ప్రసంగం ముగిసిన వెంటనే సభ నుంచి తిరుగుపయనం అయ్యారు.

# హైదరాబాదీలకు అలర్ట్.. ఈ రెండు రోజులు జర భద్రం..

హైదరాబాద్, సెప్టెంబర్ 21: ఇటీవల ఓ నాలుగు రోజులు నాన్‌స్టాప్‌గా కురిసిన వర్షాలకు హైదరాబాద్ అతలాకుతలం అయ్యింది. ఆ వర్షం పోయి.. పది రోజుల పాటు ఎండలు వచ్చాయి. దీంతో జనాలంతా హమ్మయ్య అనుకున్నారు. కానీ, ఇంతలోనే షాకింగ్ న్యూస్ చెప్పింది వాతావరణ శాఖ. హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన చేసింది. శుక్రవారం నాడు సాయంత్రం నగర వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. అంతేకాదు.. రాబోయే రెండు రోజులు సైతం భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రెండు రోజులు ప్రజలు అలర్ట్‌గా ఉండాలని సూచించింది. హైదరాబాద్, నగరం పరిసర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి హైదరాబాద్ జలయమం అయ్యింది. కొన్ని ప్రాంతాల్లో 60 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. బన్సీలాల్‌పేటలో అత్యధికంగా 68.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గన్‌ఫౌండ్రీలో 68.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉప్పల్‌లో 67.0, బేగంబజార్‌లో 62.8, నాచారంలో 61.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**అధికారులు అప్రమత్తం..** హైదరాబాద్ సహా పరిసర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్, మున్సిపల్ అధికారులను సిద్ధం చేశారు. వర్షం కారణంగా నీరు రోడ్లపై నిలవకుండా ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. మరోవైపు ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com